ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



యాదాద్రి భువనగిరి

5

బుధవారం 16 అక్టోబరు 2024

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.152	236	266
సూర్యాపేట	రూ.135	200	230
నల్లగొండ	రూ.131	190	218

ఉష్ణోగ్రత గరిష్ఠం 28.5 । కనిష్ఠం 24.0



కాలుష్యభరితంగా మూసీ జలాలు

ఆహారంతో అనారోగ్యం

• సాగు వ్యయ భరితం •



- ఆహారపదార్థాలపై మూసీ కాలుష్యం దెబ్బ
- సగానికి తగ్గిన వరి దిగుబడులు
- జీవనదుల్లోని పోషకాలు మూసీలో కరువు
- వరి, కూరగాయల్లోనూ రసాయనవ్యర్థాలు
- నిల్వసామర్థ్యం కోల్పోయే అన్నం, కూరలు
- ప్రక్షాళనే శరణ్యమంటోన్న బాధితులు

తాజాగా ఉన్నాయి కదా అని ఆకు కూరలు, కూరగాయలు వండుకొని తిన్నారంటే ఇక అంతే సంగతి. పైకి చూసేందుకు బియ్యం బాగున్నాయని వంట చేసుకొని ఆరగించారంటే మీ శరీరం విషతుల్యమవుతున్నట్లే. అదేంటి ఆశ్చర్యపోతున్నారా? ఇది నిజమేనండి. ఈ విషయాన్ని ఉస్మానియా యూనివర్సిటీ శాస్త్రవేత్తల బృందం తేల్చి చెప్పింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు ఒకప్పటి జీవనది అయిన మూసీ పరివాహకంలో పండించిన పంటలు విషతుల్యమైన విషయంతోపాటు పలు అంశాలను ఈ బృందం బయటపెట్టింది. దీంతో ఇన్నాళ్లు ఆ నీటిని తాగి, ఆ ప్రాంతంలో పండిన పంటలు తిన్న ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)

కాలుష్యకారక మూసీ నీటితో మనుషులే కాదు భూమి కూడా సారం కోల్పోయింది. ఈ నీటితో పండించే పంటల్లో నాణ్యత తగ్గడమే కాకుండా దిగుబడులు తగ్గుతున్నాయి. నీటిలో పోషకాలకు బదులు తీవ్ర రసాయనాలు ఉండటంతో ఆకు కూరలు, వరి ఇతర పంటల సాగు ఖర్చు గణనీయంగా పెరిగింది. మూసీ నీరు నేరుగా తాగడాన్ని దశాబ్దాల క్రితమే మానేసిన పరివాహక ప్రాంత వాసులు సాగు భూమికి కూడా మూసీ నీటిని నేరుగా అందించకుండా బోరుబావుల ద్వారా నీటిని తరలిస్తున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మూసీ ఎగువ ప్రాంతాలైన బీబీనగర్, భూదాన్ పోచంపల్లి, భువనగిరి, వలిగొండ, రామన్నపేట, శాలిగౌరారం వరకు కాలుష్య ప్రభావం ఎక్కువగా ఉంటే, మూసీ ప్రాజెక్టు దిగువన ఉన్న ప్రాంతాల్లో మాత్రం ఈప్రభావం కొంత తక్కువగా కనిపిస్తుందని ఉస్మానియా యూనివర్సిటీ, ఇతర పలువురు శాస్త్రవేత్తల అధ్యయనాల్లో తేలింది.

జీవనదుల్లో ఉండే పోషకాలు మూసీలో కరువు

జీవనదులైన కృష్ణా, గోదావరి, మంజీర, తుంగభద్ర వంటి జీవనదుల్లో ప్రవహించే నీటిలో ఉండే పోషకగుణాలు మూసీ నది నీటిలో ఉండడంలేదని అధ్యయనాల్లో తేలింది. మూసీ నదినీరు కాలుష్యభరితం కావడంతో ఈ నీటిలో క్షారగుణం ఎక్కువగా ఉండి, అధిక మోతాదులో భారలోహాలను కలిగిఉంటుంది. ఈనీటిలో అత్యధిక శాతం ఉంటున్న లిథియం, లెడ్, క్యాడ్మియం, క్రోమియం,నికెల్,సీసం, ఇనుము, మాంగనీస్, జింక్ వంటి భారలోహాలు అధికపరిమాణంలో ఉన్నట్లు ఈఅధ్యయనాల్లో తేల్చారు. దీంతో దశాబ్దాలుగాఈనీరు మూసీ పరివాహక భూములు సైతం లవణీకరణం చెంది సారం కోల్పోయి చౌడునేలలుగా, సారంలేని భూములుగా..

మిగతా 6వ పేజీలో..



మూసీ పరివాహకంలో సాగవుతున్న ఆకుకూరలు

అవకతవకలపై నజర్



"గ్రామపంచాయతీల్లో ఇళ్ల నిర్మాణాల అనుమతుల్లో అవకతవకలు జరుగుతున్నాయని జిల్లాయంత్రాంగానికి ఫిర్యాదులు అందుతున్నాయి. ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలోనూ ధరణి భూ సమస్యల తర్వాత అత్యధికంగా అందుతున్న సమస్యల్లో గ్రామపంచాయతీలకు సంబంధించినవే ఉన్నాయి. లేఅవుట్‌లలో అక్రమాలు, ఇంటి నెంబర్ల కేటాయింపు, ఇళ్ల సరిహద్దు తదితర సమస్యలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొస్తున్నారు. గ్రామపంచాయతీల్లో నెలకొన్న సమస్యలపై అధికారులు సరైన నిర్ణయం తీసుకోవడంలేదని, న్యాయం చేయాలంటూ మరోవైపు కోర్టులను ఆశ్రయిస్తున్నారు."

- (ఆంధ్రజ్యోతి-యాదాద్రి)

జిల్లాలో మొత్తం 426 గ్రామపంచాయతీలున్నాయి. కోర్టు కేసులు అధిక శాతం బీబీనగర్, చౌటుప్పల్, భువనగిరి, తదితర మండలాల్లో నమోదవుతున్నాయి. గతంలో గ్రామపంచాయతీనుంచి అనుమతిచ్చినట్లుగా పంచాయతీ కార్యదర్శి ధ్రువీకరించగా, మళ్లీ ఆ నిర్మాణం అనుమతి లేనిదని నోటీసులు జారీచేసిన సంఘటనలున్నాయి. దీంతో క్షేత్రస్థాయిలో జరిగిన పొరపాట్లవల్ల జిల్లాస్థాయి అధికారులకు తలనొప్పిగా మారింది. కోర్టులో కేసులు వేసే ప్రజలు పంచాయతీ కార్యదర్శి నుంచి జిల్లా పంచాయతీ అధికారి, కలెక్టర్ వరకు భాగస్వాములను చేస్తున్నారు. జిల్లాలోని 17మండలాల్లో ఇప్పటివరకు 158 వరకు కేసులు వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నాయి. తరుచూ కోర్టుకు అధికారులు హాజరుకావాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో పంచాయతీరాజ్ శాఖ ద్వారా వచ్చే ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, ప్రజలకు అధికారికంగా సమాచారం ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటుంది. ఇళ్ల నిర్మాణాలకు అనుమతులపై చాలా వరకు ఫిర్యాదులు అందుతుండటంతో లేఅవుట్లు హెచ్ఎండీఏ, డీటీసీపీ ద్వారా అనుమతులు తీసుకున్నాయా? అక్రమంగా వెలిసిన లేఅవుట్లకు పంచాయతీ కార్యదర్శులు అనుమతులు ఇచ్చారా? అన్న పూర్తిస్థాయి నివేదికలు సిద్ధం చేసుకుంటున్నారు. ప్రజావాణిలో ఇటీవల వచ్చిన చాలా వరకు దరఖాస్తుదారులకు అధికారికంగా సమాచారం అందిస్తున్నారు. అయినప్పటికీ మరో 42కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేస్తున్నారు. ప్రజలనుంచి వచ్చే ప్రతీ దరఖాస్తుకు జవాబుదారీతనం ఉండాలని, నిబంధనలకు విరుద్ధంగా ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వొద్దని ఆదేశాలు జారీచేశారు. మరోవైపు గ్రామపంచాయతీల్లో వెలిసిన లేఅవుట్లతో పాటు..

మిగతా 8వ పేజీలో..

మూసీ కాల్వలకు నిధులు

మంజూరు చేయాలి

మంత్రి ఉత్తమ్‌ను కలిసిన ఎమ్మెల్యే కుంభం



మంత్రి ఉత్తమ్‌ని సన్మానిస్తున్న ఎమ్మెల్యే కుంభం, నాయకులు

భువనగిరి రూరల్, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా నిలిచిపోయి న మూసీ కాల్వలకు నిధులు మంజూరు చేసి భువనగిరి నియోజకవర్గానికి సాగు నీరు అందించాలని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి మంగళవారం భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిని కోరారు. నియోజకవర్గ పరిధిలో అసంపూర్తిగా నిలిచిన బునాదిగాని, పిలాయిపల్లి, ధర్మారెడ్డి కాల్వలకు నిధులు మంజూరు చేసి ఈ ప్రాంత రైతులకు సాగు నీరు అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా చిన్నేరు వాగుపై వడపర్తి, అనాజీపురం, బొల్లేపల్లి, మాదారం వద్ద నాలుగు చెక్‌డ్యాంల నిర్మాణాలకు కూడా నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా మైనర్ ఇరిగేషన్ ఈఎన్‌సీ చంద్రశేఖర్, డిప్యూటీ ఈఎన్‌సీ శ్రీ నివాస్‌ను ఎమ్మెల్యే కుంభం కలిసి బొల్లేపల్లి, బీమలింగం, అలినగర్ కాల్వల అభివృద్ధిపై చర్చించారు. ఆయన వెం ట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఎలిమినేటి కృష్ణారె డ్డి, ఎల్లంల జంగయ్య, నానం కృష్ణ, వెంకట స్వామి, శివానంద్, శ్రీనివాస చారి, పిన్నం రాజు, వీర స్వామి, జీలుగు సతీష్ పవన్, రాంపల్లి కృష్ణ తదితరులున్నారు.

ధాన్యం కొనుగోళ్లను పకడ్బందీగా నిర్వహించాలి

- 369 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- నాలుగు లక్షల మెట్రిక్ టన్నులు లక్ష్యం
- సన్న రకానికి రూ.500 బోనస్
- కలెక్టర్ హనుమంతు కే.జెండగే



కలెక్టరేట్‌లో వరి ధాన్యం కొనుగోలు సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కే జెండగే

భువనగిరి కలెక్టరేట్, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): వానాకాలం 2024-25కు సంబంధించి సన్న, దొడ్డురకం వరి ధాన్యం కొనుగోలును సక్రమంగా నిర్వహించాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో రెవెన్యూ అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్‌తో కలిసి ధాన్యం కొనుగోలుపై మంగళవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో దొడ్డురకానికి సంబంధించి 322 కొనుగోలు కేంద్రాలు, 47 సన్న రకం కొనుగోలు కేంద్రాలు మొత్తం 369 కొనుగోలు కేంద్రాల్లో నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రానుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మొదటి సారిగా సన్నరకం ధాన్యానికి రూ.500 బోనస్‌తోపాటు గ్రేడ్-ఏ ధాన్యానికి క్వింటాకు మద్దతు ధర రూ.2320, సాధారణ రకానికి రూ.2300 మద్దతు ధర ప్రకటించిందన్నారు. రైతులు శుభ్రపరిచిన ధాన్యాన్ని కేంద్రాలకు తేవాలని, ధాన్యం విక్రయించిన మూడు రోజుల్లోనే రైతులకు చెల్లింపులు జరుగుతాయన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సన్న, దొడ్డురకానికి వేర్వేరుగా రికార్డులు నిర్వహించి మూమెంట్ రిజిస్టర్‌ను వేరుగా నిర్వహించాలన్నారు. రిజిస్టర్లలో రైతు పేరు, ఫోన్‌నెంబర్, సమయం, స్థలం, రైతు సంతకం తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తాగునీటి వసతి సౌకర్యం కల్పించి వర్షాలపై అప్రమత్తం, అవగాహన కల్పించి ధాన్యం తడవకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతీ ధాన్యం బస్తాపై నెంబర్ వేయాలని, దొడ్డు, సన్న రకాల కేంద్రాలను ఏఈవోలు సందర్శించాలన్నారు. ధాన్యం తేమ కొలిచే యంత్రాలను అందుబాటులో ఉంచి, రెండు రకాల ధాన్యం తరలింపునకు వేర్వేరుగా రవాణా చేయాలన్నారు. సన్నబియ్యం కొనుగోలును వేగవంతంచేసి, ఓపీఎంఎస్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. వానాకాలం పంట కొనుగోలు ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించి ఏ కేంద్రంలోనైనా రూ.500 బోనస్‌పై అవకతవకలు జరిగితే చర్యలు తీసుకుంటామన్నారు. గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు, చెక్‌పోస్టులు, టోకెన్ల జారీ, ప్యాడీ క్లీనర్లు తదితర ఏర్పాట్లు చేయాలన్నారు. ధాన్యం కొనుగోలులో ఏమైనా సమస్యలుంటే, రైతులు టోల్ ఫ్రీ సెల్:7995120554కు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి టి.నాగిరెడ్డి, ఆర్డీవో అమరేందర్, డీసీఎస్‌వో వనజాత, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ సామ జగదీశ్ కుమార్, డీపీఎం సునీల్ రెడ్డి తదితరులున్నారు.

ఫీజు బకాయిలను వెంటనే

విడుదల చేయాలి

యాజమాన్యాల నిరసన ర్యాలీ

మద్దతు తెలిపిన విద్యార్థి సంఘాలు



నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న కళాశాలల యాజమాన్యాలు

భువనగిరిటౌన్, చౌటుప్పల్ టౌన్, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి):ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు మంగళవారం భువనగిరి లో నిరసన ర్యాలీ నిర్వహించారు. పలు విద్యార్థి సంఘాల నాయకులు యాజమాన్యాలకు మద్దతుగా ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా చేశా రు. ఈ సందర్భంగా యాజామాన్యాల ప్రతినిధులు చిక్కా ప్రభాకర్‌గౌడ్, సింగనబోయిన మల్లేశం, దరిపల్లి నవీన్‌కుమార్, దరిపల్లి ప్రవీణ్‌కుమార్, మణిపాల్‌రెడ్డి మాట్లాడు తూ తమ న్యాయపరమైన సమస్యను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో కళాశాలల్లో సమస్యలు పేరుకుపోయాయన్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించే వరకూ కళాశాలలబంద్ పాటిస్తామన్నారు. కా ర్యక్రమంలో లెక్చరర్లు, పలు సంఘాల ప్రతినిధులు శ్రీనివా స్, జి ఎల్లేష్, కే రమేష్, సంతోష్, జి వెంకన్న, నవీన్, బాలేశ్వర్, వెంకటరమణ, రాజు, శ్రవణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆందోళనలు ఉధృతం చేస్తాం

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యం సంఘం ఎంజీ యూనివర్సిటీ అసోసియేట్ ప్రెసిడెంట్ బత్తుల శంకర్ డిమాండ్ చేశారు. పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని చౌటుప్పల్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట కళాశాలల యాజమాన్యం సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ విద్యార్థులకు సంబంధించిన ఫీజు బకాయిలను విడుదల చేయకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. అనంతరం ఆర్డీవో శేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సుభాష్ రెడ్డి, రాజశేఖర్, శ్రీనివాస్, విష్ణు కుమార్, మహేందర్‌రెడ్డి, ఆంజనేయులు, జంగయ్య పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు

పాటించాలి

ఆహార భద్రతా అధికారి స్వాతి



పట్టణ శివారులో హోటల్‌ను తనిఖీ చేస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

భువనగిరి గంజ్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): హోటల్ నిర్వాహకులు తప్పనిసరిగా ఆహార పదార్థాల తయారీలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆహార భద్రత అధికారులు స్వాతి, డాక్టర్ సుమన్ కల్యాణ్ అన్నారు. వినియోగదారుల ఫిర్యాదు మేరకు మంగళవారం భు వనగిరి పట్టణ శివారులోని వివేర హోటల్‌లో తనిఖీలు నిర్వహించా రు. పరిసరాల్లో పేరుకుపోయిన అపరిశుభ్రతపై నోటీసులు జారీచేశా రు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తనిఖీల్లో నిల్వ ఉన్న ఆహారాన్ని గుర్తించినట్లు, సంబంధిత ఆహారం నమూనాలు సేకరించి హై దరాబాద్ ల్యాబ్‌కు పంపినట్లు తెలిపారు. ప్రమాణాలు పాటించని ని ర్వాహకుల పట్ల కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

నేటి నుంచి విధుల్లోకి నూతన పంతుళ్లు

- కౌన్సెలింగ్ ద్వారా కేటాయింపు పూర్తి
- కౌన్సెలింగ్‌లో తడబాటుతో ఆందోళనకు గురైన నూతన ఉపాధ్యాయులు



భువనగిరిలో నూతన ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న విద్యాశాఖ అధికారులు

భువనగిరి టౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ 2024లో ఉద్యోగాలు సాధించిన నూతన ఉపాధ్యాయులు నేడు విధుల్లో చేరనున్నారు. మంగళవారం భువనగిరిలో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో నూతన ఉపాధ్యాయులకు జిల్లా విద్యా శాఖ అధికారులు పోస్టింగ్‌లు కేటాయించారు. ఖాళీ పోస్టుల జాబితా ఆధారంగా నూతన ఉపాధ్యాయులు ఆప్షన్ మేరకు పాఠశాలలను కేటాయించారు. ఈమేరకు కేటాయింపు పత్రాలను డీఈవో కె.సత్యనారాయణ అందజేసి అభినందించారు. అయితే 252 మంది ఉపాధ్యాయులకు గాను 250 మంది హాజరు కాగా, మిగతా ఇద్దరు గైర్హాజరు కావడంతో ఆ ఇద్దరికి కూడా అందరి సమక్షంలో పోస్టులను కేటాయించినట్లు తెలిసింది. నూతన ఉపాధ్యాయుల పోస్టుల కేటాయింపు పూర్తికావడంతో బుధవారం రిపోర్ట్ చేసి విధుల్లో చేరాలని అధికారులు సూచించారు.

కౌన్సెలింగ్‌లో తడబాటుతో..

షెడ్యూల్ ప్రకారం మంగళవారం ఉదయం 10గంటలకు భువనగిరి పట్టణ శివారులోని వెన్నెల కళాశాలల పోస్టుల కేటాయింపునకు కౌన్సెలింగ్ ప్రారంభం కావాల్సి ఉంది. ఈ మేరకు నూతన ఉపాధ్యాయులకు సోమవారమే సమాచారమిచ్చారు. దీంతో నిర్దేశిత సమయానికి నూతన ఉపాధ్యాయులు కౌన్సిలింగ్ కేంద్రానికి చేరుకున్నారు.కానీ సాంకేతిక కారణాలతో కౌన్సిలింగ్‌ను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు రాష్ట్ర విద్యాశాఖ అధికారులు జిల్లా అధికారులకు మంగళవారం ఉదయం సమాచారమిచ్చారు. దీంతో కౌన్సెలింగ్ కోసం ఉదయమే వచ్చిన నూతన ఉపాధ్యాయులకు జిల్లా అధికారులు కౌన్సిలింగ్ వాయిదా పడినట్లు, నూతన తేదీలను త్వరలో తెలియజేస్తామని తెలిపారు. దీంతో నూతన ఉపాధ్యాయులు ఆందోళనతో కౌన్సెలింగ్ కేంద్రంనుంచి వెనుదిరిగారు. కానీ కౌన్సిలింగ్‌ను యథావిధిగా నిర్వహించాలంటూ మధ్యాహ్నం హైదరాబాద్‌నుంచి జిల్లా అధికారులకు ఆదేశాలొచ్చాయి. దీంతో జిల్లా విద్యా శాఖ అధికారులు హడావుడిగా ఫోన్ల ద్వారా కౌన్సెలింగ్‌కు వెంటనే హాజరుకావాలంటూ నూతన ఉపాధ్యాయులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఉపాధ్యాయులు హుటాహుటిన తిరిగి రావడంతో మధ్యాహ్నం ప్రారంభమైన కౌన్సిలింగ్ రాత్రి 10గంటల వరకు కొనసాగింది.

సిమెంట్ పరిశ్రమతో ప్రాణాలకు ముప్పు



మాట్లాడుతున్న ఎన్ఈటీ విశ్రాంత ప్రొఫెసర్ రామచంద్రయ్య

● ఎన్ఈటీ విశ్రాంత ప్రొఫెసర్ రామచంద్రయ్య

రామన్నపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యాన్ని, పర్యావరణాన్ని దెబ్బతీసే సిమెంట్ కాలుష్య పరిశ్రమకు రామన్నపేట మండల ప్రాంత ప్రజలు బలికావద్దని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విశ్రాంత ప్రొఫెసర్ ఏ రామచంద్రయ్య పిలుపునిచ్చారు. రామన్నపేటలో నిర్మించ తలపెట్టిన సిమెంట్ పరిశ్రమను వ్యతిరేకిస్తూ స్థానిక రహదారి బంగ్లాలో అఖిలపక్ష పార్టీలు పర్యావరణ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు మండలవ్యాప్తంగా 600మంది వివిధ పార్టీలు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామచంద్రయ్య మాట్లాడుతూ కాలుష్యకారక పరిశ్రమ ఏర్పాటుపై ఐక్యంగా పోరాటం చేయాలన్నారు. పట్టణ ప్రాంతాల అభివృద్ధి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీజి నరసింహారావు మాట్లాడుతూ కాలుష్య పరిశ్రమకు వ్యతిరేకంగా ప్రజలు సంఘటితమై ఉద్యమించకుంటే భవిష్యత్తు తరాలు ప్రశ్నార్థకంగా మారుతాయన్నారు.

ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్, ఆయా పార్టీల నాయకులు సిరిగిరెడ్డి మల్లారెడ్డి, మేక అశోక్‌రెడ్డి, జల్లెల పెంటయ్య పోచబోయిన మల్లేశం, పల్లపు దుర్గయ్య, ఊట్కూరి నర్సింహ, ఫజల్‌బేగ్, నల్ల నరేందర్, గూని రాజు పాల్గొన్నారు.

గురుకులం..

అద్దె కలకలం

- పాఠశాల భవనాలకు తాళాలు వేసిన యజమానులు
- నెలల తరబడి అద్దె చెల్లించడం లేదని ఆవేదన
- పాఠశాలల బయటే కూర్చున్న సిబ్బంది
- ఉమ్మడి జిల్లాలో 21 గురుకుల అద్దె భవనాలు

7



మోత్కూరు: ఎంతో ఉత్సాహంతో ఆడిపాడిన తర్వాత నీటిలో బతుకమ్మలను చెరువులు, కుంటల్లో వదలుతారు. అయితే ఈ యేడాది మండలంలోని ముశిపట్లతో పాటు పలు గ్రామాల్లో చెరువులు నీళ్లు లేవు. దాంతో చెరువు కట్టలపైన, ఇతర ప్రదేశాల్లో నేలపై వదిలేశారు.

అడ్డగూడూరు : మండలం ధర్మారం, జానకి పురం, అనంతారం, వర్ధమానుకోట, లక్ష్మీదేవికాల్వ గ్రామాల బిక్కేరు వాగులో నిర్మించిన చెక్ డ్యామ్‌లు నీరు నిండి అలుగు పోస్తున్నాయి. దాంతో పట్టణాల నుంచి దసరా పండుగకు గ్రామాలకు వచ్చిన పలువురు అలుగు పోస్తూ చూడముచ్చటగా ఉండటంతో అక్కడకు వెళ్లి తిలకించారు.చెక్ డ్యామ్ పక్కన కూర్చొని ఫోటోలకు ఫోజులిచ్చారిలా..



రేపటి నుంచి నిరసన



మిర్యాలగూడ సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ, సూర్యాపేట సిటీ, అక్టోబరు 15, (ఆంధ్రజ్యోతి) : నిత్యావసర వస్తువుల ధర పెరుగుదలకు నిరసనగా ఈ నెల 17 నుంచి 28 వరకు నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. సూర్యాపేట మల్లు వెంకట నరసింహారెడ్డి భవన్, మిర్యాలగూడ పార్టీ కార్యాలయాల్లో మంగళవారం ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి ముఖ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడో సారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరలను పెంచుతూ సామాన్య ప్రజలపై ఆర్థిక భారాన్ని మోపుతుందని ఆరోపించారు. రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటుందని విమర్శించారు. ప్రజా సమస్యలను గాలికి వదిలివేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయ ప్రయోజనాల కోసమే పాకులాడుతున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా గురువారం మండల, పట్టణ, జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. త్వరలో మిర్యాలగూడలో జరగబోయే సీపీఎం సందర్భంగా ఈ నెల 21న ఆహ్వాన సంఘం సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్ర మంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, జిల్లా కమిటీ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, నూకల జగదీశ్ చంద్ర, రవి నాయక్, మల్లుగౌతంరెడ్డి, భవాండ్ల ఆండు, వినోద్‌నాయక్, శశిధర్‌రెడ్డి, రాగిరెడ్డి మంగారెడ్డి, సూర్యాపేటలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి, కొలిశెట్టి యాదగిరిరావు, మట్టిపల్లి సైదులు, మేదరమెట్ల వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

సుంకిశాలతండాలో రెవెన్యూ, అటవీ అధికారుల సర్వే

తిరుమలగిరి(సాగర్), అక్టోబర్ 15(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టులో ముంపునకు గురై పునరావాసంగా ఏర్పడిన సుంకిశాలతండాలో డి-ఫారెస్ట్ భూములను నిర్ధారించేందుకు మంగళవారం తహసీల్దార్ కృష్ణయ్య, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ గిరి ఆధ్వర్యంలో సంయుక్త సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వే నంబర్లు 1 నుంచి 57 వరకు, సర్వే నంబరు 255లకు సంబంధించి ఫారెస్ట్, రెవెన్యూ సరిహద్దులను గుర్తించేందుకు ఈ సర్వేను నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. పునరావాస తండాలో డి ఫారెస్ట్ భూములను, గతంలో ఆ పట్టాలను పొందిన రైతులను గుర్తించేందుకు ఈ సర్వే తోడ్పడుతుందని తహసీల్దార్ తెలిపారు. సందర్భంగా స్థానిక రైతులు పైలట్ ప్రాజెక్టులో భాగంగా తమ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్వేయర్లు విజయ్, లక్ష్మణ్, నాయకులు కుర్ర శంకర్‌నాయక్, కెలావత్ రామకృష్ణనాయక్, నగేష్‌నాయక్, భీమ్లానాయక్, బిచ్చానాయక్, దేవునాయక్, లాలునాయక్, హాతీరాం నాయక్, సోమ్లా, ముత్తు, దేవా, ఉపేందర్ ఉన్నారు.

ఆధ్యాత్మిక ఆధునిక.. సరస్వతీ పుత్రికలు

- తండ్రే తొలి గురువు
- ఏకలవ్య శిష్యులు సౌమ్య, సంజన
- కంఠస్థంగా భగవద్గీత
- అవలీలగా వేదాల అవపోసన
- యోగా, కరాటేలోనూ ప్రావీణ్యం

కఠినతరమైన వేదమంత్రాలను అనర్గళంగా పారాయణం చేస్తున్నారీ అక్కాచెల్లెళ్లు. భగవద్గీత శ్లోకాలను కంఠస్థంతో ఔరా అనిపిస్తున్నారు. కేవలం ఆధ్యాత్మిక, ధార్మిక విభాగాల్లోనే కాకుండా కరాటే, యోగాలోనూ సత్తా చాటుతున్నారు. ఆధ్యాత్మిక, ఆధునిక విషయాల్లో ప్రావీణ్యం సాధించిన అక్కాచెల్లెళ్లు సంజన, సౌమ్యల స్ఫూర్తిదాయక కథనం.

(ఆంధ్రజ్యోతి- నార్కట్‌పల్లి)

నల్లగొండ జిల్లా నల్లగొండ మండలం(పూర్వం నార్కట్‌పల్లి మండలం) అవురవాణికి చెందిన దాసోజు నర్సింహాచారి, లక్ష్మీప్రసన్న దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్దకుమార్తె సౌమ్య హైదరాబాద్‌లో ఇంటర్ ఫస్టియర్ చదువుతుండగా, రెండో కుమార్తె సంజన నార్కట్‌పల్లి మండలం బీ.వెల్లెంల జడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి అభ్యసిస్తోంది.వృత్తిరీత్యా నర్సింహాచారి స్వర్ణకారుడే అయినా ప్రవృత్తి రీత్యా కరాటే, యోగా శిక్షకుడు. ఆడపిల్లలు ఎందులోనూ తీసిపోరని కానీ దేహరక్షణ, ఆత్మరక్షణకు కరాటే, యోగా అవసరమని నమ్మిన నర్సింహాచారి కుమార్తెలకు చిన్నవయసు నుంచి వాటిని నేర్పిస్తూ తొలి గురువుగా మారాడు. కరాటే పోరాటాలు, యోగాసాధనలో మెళకువలు నేర్పించాడు. ఆయన తర్ఫీదులో 100కు పైగా యోగాసనాలను అవలీలగా వేయగలరు ఈ అక్కాచెల్లెళ్లు. తమ ప్రావీణ్య ప్రదర్శనతో ఎన్నో మెడల్స్ సర్టిఫికెట్లు, అభినందనలు అందుకున్నారు.



కరాటే శిక్షకుడైన తండ్రి నర్సింహాచారితో అక్కాచెల్లెళ్లు

సత్సంగాలతో వేదాలపై ఆకర్షణ

నల్లగొండ జిల్లాకేంద్రంలోని ఆర్యసమాజ్‌లో ప్రతీ ఆదివారం కరాటే శిక్షణ ఇచ్చేందుకు తండ్రి నర్సింహాచారి వెళ్తుంటారు. అదే సందర్భంలో సత్సంగాలు జరగడం చూసి తమ పిల్లలను సత్సంగానికి తీసుకువస్తే మంచి నడవడి, ప్రవర్తన, ఆధ్యాత్మికత అలవడుతుందని భావించి తీసుకువెళ్లేవాడు. ఆ సత్సంగాల్లో వేద పండితులు చేస్తున్న మంత్రోచ్ఛారణలు సంజన, సౌమ్యలను ఎంతగానో ఆకర్షించి వాటిని తామూ చదివేందుకు ఆసక్తిని కలిగించాయి. వీరి ఆసక్తిని గుర్తించిన జగన్‌అనే వ్యక్తి యజ్ఞకృతువు, మంత్రాలకు సంబంధించిన పుస్తకాన్ని అందజేశాడు. దీంతో ఆ పుస్తకంలో ఉన్న శ్లోకాలను, మంత్రాలను చదివి సత్సంగాల్లో చెప్పడం, చదవడం చూసిన తండ్రి వీరికి మరిన్ని పుస్తకాలను అందజేశారు. కుమార్తెల్లో ఉన్న జిజ్ఞాసను, జ్ఞాపకశక్తిని గమనించిన తండ్రి వీరికి ఆధ్యాత్మికత గ్రంథాలు, పుస్తకాలను తీసుకువచ్చి ఇచ్చి ఇవ్వడంతో అవలీలగా నేర్చుకుని అప్పజెబుతూ ఆశ్చర్యపర్చారు.

మొదటి పదం చెబితే చాలు

కంప్యూటర్ విద్యవైపు ఆసక్తి చూపిస్తున్న నేటి యువతకు భగవద్గీత గురించి సరిగా తెలియదు. అలాంటిది భగవద్గీతలోని 18 అధ్యాయాలను ఈ అక్కా చెల్లెళ్లు ఎంచక్కా చదివేస్తున్నారు. అదీనూ ఏ అధ్యా యంలోని శ్లోకం మొదటి పదాలను చెబితే చాలు ఆ శ్లోకాలను పూర్తిగా చెప్పగలరు. పలు వేదికలపై భగవద్గీత పారాయణాలను వినిపించి అభినందనలు అందుకున్నారు. 2022 సెప్టెంబరు 2న హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో లీడ్ వరల్డ్ 18,000ల పేరిట జరిగిన భగవత్ గీతాపారాయణంలో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4గంటల్లోపు 18అధ్యాయాలు, 700 శ్లోకాలను పారాయణం చేశారు.

యజుర్వేదంపై పట్టు

అత్యంత క్లిష్టమైన తెలుగు భాషలోని యజుర్వేదాన్ని కంఠస్థం చేశారు. అతికష్టమైన పురుషసూక్తం శ్లోకాలను సహితం ఈ అక్కాచెల్లెళ్లు అవలీలగా చెప్పగలగడం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. గురువు లేకుండా సత్సంగాల్లో వేద పండితులు చదివే మంత్రాలను విని ఇంటికి వచ్చి ఆ పుస్తకాల్లోని మంత్రాలను చదివి తండ్రికి కంఠస్థం చేస్తూ ఇలా గురువే లేని ఏకలవ్య శిష్యులుగా ఎదిగారు.

మనుస్మృతి చదవాలనే సంకల్పం

వేదాలు, గ్రంథాలు, ఆధ్యాత్మిక పుస్తకాలను ఎన్నింటిని వల్లెవేసినా మనుస్మృతి లాంటి పుస్తకాన్ని చదవాలన్నదే ఈ అక్కాచెల్లెళ్ల ఆకాంక్ష. భారత రాజ్యాంగానికి మూలమైనదిగా భావించే మనుస్మృతిని చదవాలనే సంకల్పాన్ని ప్రారంభించారు. 2,650 శ్లోకాలు 12 అధ్యాయాలతో కూడిన ఈ పుస్తకాన్ని కనీసం ఏడాదిన్నర లోపైనా పూర్తిగా చదవాలనే లక్ష్యంతో ప్రయత్నిస్తున్నారు. అదే విధంగా ఎంత కష్టపడైనా అఖిల భారత సర్వీసుల వరకు చదువులో చేరుకోవాలనే లక్ష్యంతో విద్యను అభ్యసిస్తున్నారు.

కంఠస్థం చేసిన గ్రంథాలు

సంజన, సౌమ్యలు కంఠస్థం చేసిన గ్రంథాలు చాలానే ఉన్నాయి. భగవద్గీతలోని 18 అధ్యాయాలు, 700 శ్లోకాలు, వ్యాస మహర్షి రచించిన వేదాంత దర్శనంలోని 4 అధ్యాయాలు, 16 పాదాలు, 555 బ్రహ్మసూత్రాలు, పతంజలి మహర్షి రచించిన యోగ దర్శనంలోని సమాధి, సాధన, విభూదీ, కైవల్య పాదాలు, 195 మూల సూత్రాలు, యజుర్వేదంలోని 450 మంత్రాలు, అధర్వణ వేదంలోని శాంతి సూక్తం, లక్ష్మీ సూక్తం, సంధ్యా శివసంకల్పం, బ్రహ్మయజ్ఞం, శివతాండవం, దుర్గాదేవి స్తుతి, లింగాకష్టకం, బ్రహ్మస్తోత్రం, ఈశ్వర స్తుతి, స్వస్తివాచన మంత్రాలు, శాంతికరణ మంత్రాలు, ఉపస్థాన మంత్రాలు, గాయత్రి, నమస్కార, మృత్యుంజయ మంత్రాలతో పాటు రాష్ట్రీయ ప్రార్థన, ధ్వజగీతము, ప్రాతఃస్మరణ మంత్రాలను, 60 ధర్మాచరణ శ్లోకాలు, దశావతార స్తోత్రం, ఆశీర్వచన మంత్రాలు, దైవిక ప్రార్థనలు, దీపస్తుతి, మంత్ర పుష్పం ఇలా ఏవైనా 10 గంటలకు పైగా ఏకధాటిగా పూర్తి కంఠస్థంతో చెప్పగల ప్రజ్ఞావంతులు.



దుర్గాస్తుతి చేస్తున్న సౌమ్య, సంజన

ముల్కపల్లి హత్య ఘటనపై కొనసాగుతున్న విచారణ

- ఇప్పటికే ఎస్ఐ సస్పెన్షన్
- సీఐ, కానిస్టేబుల్‌పై కూడా వేటు పడే అవకాశం?

గుర్రంపోడు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలం ముల్కలపల్లి గ్రామంలో ఆగస్టు 29న జరిగిన జాల రజిత హత్య కేసు విచారణ కొనసాగుతోంది. ఈ కేసులో హత్య కేసును ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేసి ఇద్దరు నిందితులను తప్పించేందుకు రూ. లక్ష లంచం తీసుకున్నాడని రుజువు కావడంతో ఎస్ఐ వేమిరెడ్డి నారాయణరెడ్డిపై ఐజీపీ సత్యనారాయణ సస్పెన్షన్ వేటు వేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ముల్కపల్లిలో 29న ఇంట్లో ఎవరూ లేని సమయంలో రజిత(30) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు కేసు నమోదు చేశారు. ఇదే గ్రామానికి చెందిన జాల రాములుపై అనుమానం ఉందని రజిత భర్త దుర్గయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు రాములును అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించి చేతులు దులుపుకున్నారు. ఈ కేసులో ప్రమేయం ఉన్న రాములు భార్య పార్వతమ్మ, ఆయన అన్న కుమారుడు వెంకటయ్యను తప్పించేందుకు పోలీసులు సహకరించి వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో మృతురాలి కుటుంబానికి రూ.30 లక్షలు ఇచ్చేందుకు జాల రాములు అంగీకరించి విషయం బహిర్గతమైనప్పటికీ హత్యగా పోలీసులు పట్టించుకోలేదు. ఈ వ్యవహారంలో పోలీసులు భారీగా ముడుపులు తీసుకొని మరికొందరి నిందితులను తప్పించేందుకు సహకరించారని ఆరోపణలు వచ్చాయి. దాంతో ఎస్పీ శరత్‌చంద్రపవార్, ఏఎస్పీ రాములునాయక్ ఆధ్వర్యంలో కేసు విచారణకు ఆదేశించారు. ఈ విచారణలో జాల రాములు భార్య పార్వతమ్మ, ఆయన అన్న కుమారుడు వెంకటయ్య ప్రమేయం ఉన్నట్టు తేలడంతో వీరిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. రజితను హత్య చేసినట్టు సదరు నిందితులు ఒప్పుకున్నట్టు తెలిసింది. ఈ హత్యను ఆత్మహత్యగా చిత్రీకరించడంతో పోలీసుల పాత్ర ఉన్నట్టు ఉన్నతాధికారుల విచారణలో బయటపడింది. దీంతో ఎస్ఐ నారాయణరెడ్డిని సస్పెండ్ చేస్తూ ఐజీపీ సత్యనారాయణ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. ఇదిలా ఉండగా నిందితుల నుంచి రూ.లక్ష లంచంగా తీసుకున్న విషయంలో ఓ కానిస్టేబుల్ ప్రధాన పాత్ర పోషించినట్టు తెలిసింది. ఎస్ఐ వేమిరెడ్డి నారాయణరెడ్డి బాధ్యతలు తీసుకున్న తర్వాత పోలీస్‌శాఖలో ఏనాడో రూపుమాసిన దఫేదారి వ్యవస్థకు ఈ కానిస్టేబుల్ ఆద్యం పోసినట్టు తెలుస్తోంది. ఈ కేసులోనే కాకుండా మరో కొంతమంది వద్ద భారీ ఎత్తున డబ్బులు డిమాండ్ చేసినట్టు గతంలో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. హత్య కేసు అయినప్పటికీ సీఐని కూడా ఆత్మహత్యగా చిత్రీకరించే విషయంలో సీఐ పాత్ర కూడా ఉన్నట్టు తెలుస్తోంది. ఏఎస్పీ రాములు నాయక్ ఆధ్వర్యంలో జరిగిన విచారణలో ఆరోపణలు వస్తున్నా ఎస్ఐ, సీఐలను పక్కన పెట్టి పూర్తి స్థాయిలో విచారణ జరిపించారు. ప్రస్తుత సీఐ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లాకు చెందిన వారు కావడంతో ఆయనపై వేటు వేసే విషయంలో ఉన్నతాధికారులు ఆచితూచి వ్యవహరిస్తున్నట్టు తెలుస్తోంది. కేసు విచారణ కొనసాగుతుందని చెబుతున్న అధికారులు త్వరలో సీఐ, కానిస్టేబుల్‌పై కూడా వేటు వేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

ఆహారంతో అనారోగ్యం..సాగు వ్యయ భరితం

(ఐదో పేజీ తరువాయి)

తయారవడంతో ఇక్కడ సాగు వ్యయభరితంగా మారింది. అంతేకాకుండా మూసీ నీటిలో నైట్రేట్‌శాతం కూడా అత్యధికంగా 35.40 మిల్లీగ్రాములు/లీటర్‌గా గుర్తించారు. దీంతో ఈ నీరు పంటలు, భూమిపైనా తీవ్ర ప్రభావం చూపుతుందని, దీన్ని సరిచేసేందుకు రైతులు అత్యధికంగా పెట్టుబడులు వెచ్చించాల్సి వస్తోంది.

మూసీ కింద దిగుబడి తగ్గిన ధాన్యం

మూసీ నది పరీవాహక ప్రాంతంలో ఎక్కువగా వరి సాగవుతుంది. ఇతర ప్రాంతాల్లో స్వచ్ఛమైన నీటితో పండే వరి ఎకరాకు 28నుంచి 30 క్వింటాళ్ల దిగుబడులు వస్తే, మూసీ పరివాహకంలో వరి దిగుబడులు ఇందులో సగమే అంటే ఎక రాకు 15 క్వింటాళ్లకు మించి రావడంలేదు. పైగా మూసీ పరీవాహకంలో సన్న ధాన్యం సాగయ్యే పరిస్థితి లేకుండా పోయింది. మూసీ నీటిలో ఉండే రసాయనాల ప్రభావంతో వరి పైర్లు రోగనిరోధక శక్తిని కోల్పోతాయని, తెగుళ్ల తాకిడి ఎ క్కువగా ఉంటుందని శాస్త్రవేత్తలు నిర్ధారించారు. గింజలో తాలుశాతం ఎక్కువగా వస్తుందని, గింజ నూకశాతం ఇతర ప్రాంతాల్లో పండే వరిలో 12శాతం ఉంటే, మూసీ పరివాహకంలో అది 20శాతం వరకు ఉంటుందని పేర్కొన్నారు. అందువల్లే మూసీ కింద తెగుళ్ల తాకిడి తట్టుకొని, గింజగట్టిగా ఉండే ఐఆర్-64 వంటి దొడ్డురకాల ధాన్యం సాగుచేస్తున్నారు. మూసీ కింద రైతులు సొంత అవసరాలకు మినహా మిగిలిన ఆయకట్టంతా దొడ్డురకం ధాన్యం సాగుచేస్తుండడం ఇక్కడి పరిస్థితికి అద్దం పడుతోంది. దిగుబడులు తగ్గడమే కాకుండా మూసీ కింద సాగు పెట్టుబడులు కూడా ఇతర ప్రాంతాల అధికమవుతున్నాయి. మూసీయేతర ప్రాంతాల్లో వరిసాగుకు ఎకరాకు కనీసం రూ.30వేల పెట్టుబడి అయితే, మూసీ కింద అది రూ.40వేలు దాటుతోందని, అదే సమయంలో ధాన్యం ఉత్పత్తి మాత్రం సగం మేర తగ్గుతుందని, దీంతో సాగు ఇబ్బందికరంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిల్వ సామర్థ్యం కోల్పోయిన కూరగాయలు

మూసీ కింద సాగైన ధాన్యంతో తయారయ్యే బియ్యం నాణ్యత కూడా తక్కువగా ఉంటోందని చెబుతున్నారు. ఈ బియ్యంతో వండిన అన్నం ఆరుగంటలకు మించి నిల్వ ఉండడంలేదు. ఆరు గంటలు దాటితే ఈ అన్నం కాస్త మెత్తబడి, అందులో నీరు చేరి తినడానికి పనికిరాకుండా పోతుంది. అదే ఇతర ప్రాంతాల్లో పండే ధాన్యం ద్వారా వచ్చే బియ్యమైతే కనీసం 12గంటల వరకు నిల్వ ఉంటుంది. అదేవిధంగా మూసీకింద పండే కూరగాయలు, ఆకుకూరలు సైతం ఒకపూటకు మించి నిల్వ ఉండడంలేదు. ఆ తర్వాత కొంత సమయానికి చెడిపోతున్నాయని నిర్ధారించారు. వాటిల్లో ఉండే రసాయన అవశేషాలే ఇందుకు కారణమని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.




మూసీ ఆయకట్టు పరిధిలో సాగు అవుతున్న వరి

ఆకుకూరల్లోనూ రసాయన వ్యర్థాలే

మూసీ పరీవాహక ప్రాంతాల్లో పండించే టమాటా, వంకాయ, బచ్చలికూర, తోటకూర, చుక్కకూర ఇతర కూరగాయలు, ఆకుకూరల్లో సైతం రసాయన అవశేషాలను గుర్తించారు. ప్రధానంగా వీటిల్లో క్యాడ్మియం, క్రోమియం, నికెల్, సీసం, ఇనుము, మాంగనీస్, జింక్ వంటి రసాయన మూలాలు గుర్తించారు. వీటిని బాగా ఉడికించకపోతే రోగాల బారిన పడాల్సి వస్తుందని శాస్త్రవేత్తలు, డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. ఈ కూరగాయలు, ఆకుకూరలు, ఆహారం తీసుకోవడంవల్ల దీర్ఘకాలంలో క్యాన్సర్ రోగాలతోపాటు, రక్తహీనత, గర్భస్రావ సమస్యలు, అల్సర్, గుండె, నాడీ, ఎముకల సంబంధిత వ్యాధులు వస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. ప్రమాదకరమైన ఆర్థరైటిస్ సైతం ఈ రసాయనాల ప్రభావం వల్లే వస్తుందని నిర్ధారించారు.


సన్న ధాన్యం సాగుచేస్తే దోమపోటు



మూసీ నీరు విషపూరితమవడం వల్ల ఇక్కడ సన్నరకాల ధాన్యం సాగుచేస్తే రోగాల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ప్రధానంగా దోమపోటు, తెగుళ్లు, తెల్లకంకి వచ్చి తీవ్రంగా నష్టపోతున్నాం. అందువల్ల ఈ తెగుళ్లను తట్టుకునే దొడ్డురకాలే ఎక్కువగా సాగుచేస్తున్నాం. బోర్లకింద కొంతమేర సన్నరకాలు సొంత అవసరాల కోసం సాగుచేస్తున్నాం. పెట్టుబడి కూడా ఎక్కువవుతోంది.

-తుర్కపల్లి సురేందర్, రైతు, గోకారం, వలిగొండ మండలం


రసాయన అవశేషాలతో ఆందోళన



మూసీ నీటి కాలుష్యం వల్ల ధాన్యం, ఆకుకూరల్లో రసాయన అవశేషాలున్నాయని ఇక్కడ పరిశోధనలు చేసిన శాస్త్రవేత్తలు, డాక్టర్లు చెబుతున్నారు. మూసీ నీటిని ప్రక్షాళన చేయకపోతే భవిష్యత్ మరింత భయానకంగా ఉంటుందనే విషయం తలుచుకుంటే ఆందోళన కలుగుతుంది. ప్రభుత్వం ఈనీటి ప్రక్షాళనపై చర్యలుచేపట్టాలి.

-జెల్లెల పెంటయ్య, వ్యవసాయకార్మికసంఘం జిల్లా కార్యదర్శి, రామన్నపేట

పంటలు విక్రయించలేని దుస్థితి



జీవనది మూసీ కలుషితమవడంతో ఈ పరీవాహక ప్రాంత భూసారం కోల్పోయింది. స్వచ్ఛమైన నీటితో వరి పండిస్తే ఎకరాకు 50 బస్తాలవరకు దిగుబడులు వస్తే, మూసీనది కింద కేవలం 20 బస్తాలకే దిగుబడి పరిమితమయింది. ఇక్కడ పండే వరి, కూరగాయలు, ఆకుకూరలు కొనేందుకు ఎవరూ ఇష్టపడడం లేదు. దీంతో ఒకటి, రెండు రకాల వరిసాగుకే పరిమితమవ్వాల్సి వచ్చింది.

-బూరుగు కృష్ణారెడ్డి, రైతుసంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు, చౌటుప్పల్

వేర్వేరు కారణాలతో నలుగురి బలవన్మరణం

ఉమ్మడి జిల్లాలో సోమ, మంగళవారాల్లో వేర్వేరు కారణాలతో నలుగురు వ్యక్తులు ఆత్మహత్య చేసుకున్నారు.



యాదయ్య (ఫైల్)

భూదాన్‌పోచంపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఓ వృద్ధుడి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనయాదాద్రి-భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి పట్టణంలో మంగళవారం జరిగింది. ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. భూదాన్‌పోచంపల్లి పట్టణంలోని గాంధీనగర్ కాలనీకి చెందిన చెక్క యాద య్య(60) మత్స్యకార్మికుడు. కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. అయితే మంగళవారం మధ్యాహ్నం భార్య కూలీ పనికి వెళ్లగా ఇంట్లోనే యాదయ్య ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటికి తిరిగి వచ్చిన భార్య గమనించి ఇరుగుపొరుగు వారిని పిలి చింది. అప్పటికే మృతి చెంది ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉండగా వారికి వివాహమైంది. భార్యాభర్తలు మాత్రమే అద్దె ఇంటిలో ఉంటున్నారు. యాదయ్య చేపలు విక్రయిస్తూ జీవనం సాగిస్తుండగా భార్య స్థానిక ఆలయంలో కూలీగా పనిచేసి జీవనం సాగిస్తున్నారు. కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గొంతు నొప్పి భరించలేక ఇంటర్ విద్యార్థి



సుధాకర్(ఫైల్)

కొండమల్లేపల్లి అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో గొంతు నొప్పితో భరించలేక ఓ ఇంటర్ విద్యార్థి ఉరేసుకొని సోమవారం సాయంత్రం బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని స్థానిక సాగర్ రోడ్డులో నివాసం ఉంటున్న కేతావత్ నర్సింహ కుమారుడు సుధాకర్(17) పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. సుధాకర్ నాలుగేండ్లుగా గొంతు నొప్పితో బాధపడుతతున్నాడు. పలుమార్లు చికిత్స చేయించుకున్న ఫలితం లేకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలోనే సోమవారం ఇంట్లో ఎవరూ లేనిసమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించగా ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

కూల్‌డ్రింక్‌లో పురుగుల మందు తాగి యువకుడు



శివ (ఫైల్)

మునుగోడు,అక్టోబరు 15 (ఆంధ్ర జ్యోతి) : కూల్‌డ్రింక్‌లో పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసు కున్నాడు. ఈ ఘటన మునుగోడు మండల కేంద్రంలో మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన మండల కేంద్రానికి చెందిన యాసరాణి వీరయ్యకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు శివ డిగ్రీ వరకు చదువుకున్నాడు. ఇటీవల సొంతంగా ఎక్స్‌కవేటర్ తీసుకొని నడుపుతూ కుటుంబానికి ఆసరాగా ఉంటున్నాడు. తల్లిదండ్రులు హైదరా బాద్‌లోని బంధువుల ఇంటికి వెళ్లగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో కూల్‌డ్రింక్ సీసాలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటికి వచ్చిన తల్లిదండ్రులు తలుపులు తెరిచి చూడగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర హాస్పిటల్‌కు తరలించారు. కాగా మృతికి గల కారణాలు తెలియరాలేదు.

మద్యానికి బానిసై మరొకరు..



నర్సింహ (ఫైల్)

చిట్యాలరూరల్ ,అక్టోబరు 15 (ఆంధ్ర జ్యోతి) : చిట్యాల మండలం వనిపాకల గ్రామానికి చెందిన మల్లెబోయిన నర్సింహ(43) హమాలీ. మద్యానికి బానిసై సు మారు 8 మాసాలుగా భార్య పద్మ, కుమారులను వదిలి తల్లి బుచ్చమ్మ వద్ద ఉంటున్నాడు. వ్యవసాయ పనులను చేసుకునే బుచ్చమ్మ బయటకు వెళ్లగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో నర్సింహ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటికి వచ్చిన తల్లి బుచ్చమ్మకు నర్సింహ వేలాడుతూ కనిపించడంతో చుట్టుపక్కల వారిని పిలిచింది. వారు వచ్చి నర్సింహను పరిశీలించగా అప్పటికే మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నకిరేకంటి ధర్మ తెలిపారు.

కోదండ రామాలయంలో చోరీకి యత్నం

నేరేడుచర్ల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో కొత్తగా నిర్మించిన కోదండ రామా లయంలో గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి చోరీకి యత్నించారు. ఆలయ కమిటీ చైర్మన్ కొణతం సత్యనారాయణ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆలయ వాచ్‌మన్ రోజు మాదిరిగానే సోమవారం రాత్రి రెండు గేట్లకు తాళం వేసి పక్కనే ఉన్న గదిలో నిద్రించాడు. గుర్తు తెలియని వ్యక్తులు ప్రహరీ గోడ దూకి వచ్చి దొంగతనానికి యత్నించారు. మంగళవారం ఉదయం ఆలయ పూజారి ఆశిష్ ఆలయానికి వచ్చి తలుపు తీయబోగా దొంగతనానికి యత్నించినట్లు గమనించి సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. తాను వెళ్లి పరిశీలించగా ఆలయ ప్రధాన ద్వారానికి గల బేడెం పగులగొట్టి తాళాన్ని తీసుకుళ్లెనిట్లు గుర్తించారు. ఆలయంలో ఎలాంటి వస్తువులు అపహరణకు గురికాలేదన్నారు. ఈ విషయంపై పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు.

గురుకులం.. అద్దె కలకలం

- పాఠశాల భవనాలకు తాళాలు వేసిన యజమానులు
- నెలల తరబడి అద్దె చెల్లించడం లేదని ఆవేదన
- పాఠశాలల బయటే కూర్చున్న ఉపాధ్యాయులు, సిబ్బంది
- ఉమ్మడి జిల్లాలో 21 గురుకుల అద్దె భవనాలు



మోత్కూరులో పాఠశాల భవనం గేటుకు తాళం వేయడంతో బయట కూర్చున్న ప్రిన్సిపాల్, సిబ్బంది

మోత్కూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలల ప్రైవేట్ భవనాలకు అద్దె చెల్లించకపోవడంతో కలకలం లేచింది. నెలల తరబడి అద్దె చెల్లించకపోవడంతో యజమానులు మంగళవారం భవనాలకు తాళాలు వేసి నిరసన తెలిపారు. తాళాలు వేయడంతో ఉపాధ్యాయులు, సిబ్బంది పాఠశాలల బయటే కూర్చోవల్సి వచ్చింది. అద్దె భవనాల్లో నడుస్తున్న గురుకుల పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్ల భవనాలకు ఎనిమిది నెలలుగా, మైనార్టీ పాఠశాలలకు 14 నుంచి 20 నెలలకుపైగా అద్దె చెల్లించాల్సి ఉందని యజమానులు ఆవేదన వ్యక్తం చేశారు. మైనార్టీ గురుకుల పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్ల భవనాలకు గత బీఆర్ఎస్ ప్రభుత్వంతో పాటు ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కలిపి 14 నుంచి 20 నెలల అద్దె చెల్లించాల్సి ఉంది. అద్దె భవనాల యజమానుల సంఘం సంబంధిత శాఖల కార్యదర్శులను, మంత్రులను కలిసి పలుమార్లు తమ గోడు వెళ్లబోసుకున్నా అద్దె బకాయిలు చెల్లించలేదు. గత నెల 30న హైదరాబాదులో సమావేశమైన అద్దెభవనాల యజమానుల సంఘం నాయకులు దసరా సెలవులు ముగిసేలోపు తమకు అద్దె బకాయిలు చెల్లించకుంటే పాఠశాలలు, హాస్టళ్ల భవనాలకు తాళాలు వేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సంబంధిత ఉన్నతాధికారులకు నోటీసులు అందజేశారు. అయినా ప్రభుత్వం స్పందించకపోవడంతో మంగళవారం ఉమ్మడి జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా గురుకుల పాఠశాలలకు యాజమానులు తాళాలు వేశారు. ప్రిన్సిపాళ్లు, సిబ్బంది. విద్యార్థులు మంగళవారం పాఠశాలకు వెళ్లగా గేట్లకు తాళాలు వేసి ఉండటంతో బయటనే ఉండాల్సి వచ్చింది. అదనపు కలెక్టర్లు, పోలీసు అధికారులు భవనాల యజమానులతో ఫోన్‌లో సంప్రదింపులు జరిపినా ఫలితం లేకపోయింది. బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హైద్రాబాదులో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి త్వరలోనే బకాయిలు చెల్లిస్తామని చెప్పడం, తాళాలు



తీయని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించడం, కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు. ఎక్కడి కక్కడ స్థానిక పోలీస్, రెవెన్యూ, బీసీ సంక్షేమ శాఖల అధికారులు భవనాల యజమానులతో మాట్లాడి మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత పాఠశాలలకు తాళాలు తీయించారు.

ఉమ్మడి జిల్లాలో రూ. రెండు కోట్లు

ఉమ్మడి నల్లగొండ జిల్లా సుమారు 21 అద్దె భవనాలు ఉన్నాయని, రూ. 2కోట్లు ప్రభుత్వం అద్దె బకాయి చెల్లించాలని చెబుతున్నారు. 11 భవనాలకు యజమానులు తాళాలు వేశారు.

అద్దె చెల్లించకపోవడంతో తాళాలు



ఎన్ని వినతి పత్రాలు ఇచ్చినా, మంత్రులను, అధికారులను కలిసినా ప్రభుత్వం మాకు అద్దె బకాయిలు విడుదల చేయలేదు. పాఠశాల భవనాలకు తాళాలు వేస్తామని చెప్పినా ప్రభుత్వం స్పందించక పోవడంతోనే విసిగి ఈ రోజు భవనాలకు తాళాలు వేశాం. ప్రభుత్వంలో కొంత కదలిక రావడంతో, విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టి లో పెట్టుకుని, ప్రభుత్వం త్వరలోనే తమకు అద్దె బకాయిలు చెల్లిస్తుందన్న నమ్మకంతో తాళాలు తీశాం. కనీసం 3 ఏళ్ల వ్యవధితో కూడిన అద్దె అగ్రిమెంటు చేయాలని, జిల్లా కేంద్రాలు, కార్పొరేషన్ల పరిధిలో చదరపు అడుగుకు కనీస రేటు రూ.30, మునిసిపాలిటీ, మండలాల్లో రూ.25 ఇవ్వాలని, ప్రతి రెండేళ్లకోసారి అద్దె 20 శాతం పెంచాలని, ఆట స్థలానికి అడుగుకు కనీసం రూ.10చొప్పున అద్దె ఇవ్వాలని కోరుతున్నాం.

– సత్యంగౌడ్, అద్దె భవనాల యజమానుల సంఘం ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు

అద్దెలు అందక అవస్థలు

ప్రభుత్వం కనీసం రెండు, మూడు మాసాల కోసారైనా అద్దెలు చెల్లించక పోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నామని యజమానులు చెప్పారు. తాము బ్యాంకుల్లో అప్పు తీసుకుని భవనాలు నిర్మించామన్నారు. ప్రభుత్వం 8 నుంచి 20 మాసాలు అద్దె చెల్లించకపోవడంతో తాము బ్యాంకుల్లో అప్పు కిస్తులు (ఈఎంఐ) చెల్లించలేకపోతున్నా మన్నారు. తమపై చక్ర వడ్డీ భారం పడటంతో పాటు బ్యాంకుల్లో తమ పరపతి (క్రెడిబిలిటీ) దెబ్బతింటున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. అద్దె ఇవ్వకపోగా భవనాల్లో వసతుల కొరత తీర్చాలని, అవసరమైన మరమ్మతులు చేయాలని ప్రభుత్వ అధికారులు తమను ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు.

నిత్యపూజా కైంకర్యాలు



ఉదయం 3.30 గంటలకు ఆలయాన్ని తెరుస్తారు
సుప్రభాత సేవ:ఉదయం3.30నుంచి4:30వరకు
ఆరాధన: 4 నుంచి 4.30వరకు
బాలభోగం:4.30 నుంచి 5.15 వరకు
నిజాభిషేకం: 5.15నుంచి 6.15గంటలవరకు
సహస్రనామార్చనలు:6.15నుంచి 7గంటల వరకు
రాజభోగం:12.00నుంచి ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 1-4 వరకు సర్వ దర్శనాలు.
తిరువారాధన:సాయంత్రం 7నుంచి8వరకు
సహస్రనామార్చన: రాత్రి 7.30 నుంచి 8.15 గంటల వరకు
రాత్రి నివేదన:రాత్రి 9:30నుంచి9:45 వరకు
శయనోత్సవదర్శనం:9.30-9.45ద్వార బంధనం
ఉచిత దర్శనం: ఉదయం 7 నుంచి 9 గంటల వరకు తిరిగి సాయంత్రం 5-7 రాత్రి 8.15 నుంచి 9 గంటల వరకు
వీఐపీ వేళలు:ఉదయం 9నుంచి 10 వరకు సాయంత్రం 4 నుంచి 5 వరకు

– భువనగిరి అర్బన్, (ఆంధ్రజ్యోతి)

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	589.50
టీఎంసీలు	310.5510
ఎడమకాల్వకు నీటి విడుదల	6173
కుడికాల్వకు	6182
విద్యుత్ కేంద్రం ద్వారా	29,638
సాగర్‌కు నీటి రాక	66,067
ఎస్ఎల్‌బీసీ ద్వారా	2,400 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	44,793 క్యూసెక్కులు

– నాగార్జునసాగర్, (ఆంధ్రజ్యోతి)

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	44.38 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	30,200
నీటి విడుదల	36,804

– మేళ్లచెర్వు,(ఆంధ్రజ్యోతి)

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	644.22 అడుగులు
టీఎంసీలు	4.26
ఇన్‌ఫ్లో	847.10 క్యూసెక్కులు
ఔట్‌ఫ్లో	1774,29 క్యూసెక్కులు

– కేతేపల్లి,(ఆంధ్రజ్యోతి)

శాలిగౌరారం

పూర్తి స్థాయి నీటిమట్టం	21 అడుగులు
ప్రస్తుత నీటిమట్టం	9 అడుగులు

– శాలిగౌరారం,(ఆంధ్రజ్యోతి)

డిండి

పూర్తి స్థాయి నీటిమట్టం	36 అడుగులు
ప్రస్తుత నీటిమట్టం	36 అడుగులు
ఇన్‌ఫ్లో	8600 క్యూసెక్కులు
ఔట్‌ఫ్లో	8600 క్యూసెక్కులు

-డిండి,(ఆంధ్రజ్యోతి)

ఆరు బయటే కూర్చున్న ఉపాధ్యాయులు

హుజూర్‌నగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని మైనార్టీ గురుకుల పాఠశాలకు భవన యజమాని మంగళవారం తాళం వేశారు. దీంతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు ఆరుబయటే కూర్చున్నారు. ఉదయం 8గంటలకు పాఠశాలకు ఉపాధ్యాయులు వచ్చేవరకు భవన యజమానులు నామని కుమారస్వామి, నామని మధుబాబు, వనం రమేష్ తాళాలు వేశారు. 13 నెలలుగా అద్దె బిల్లులు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. నెలకు సుమారు రూ.లక్షా 20వేలు అద్దె ఉండగా, సంవత్సరం దాటినా అద్దె చెల్లించడం లేదన్నారు. గతంలో మైనార్టీ గురుకుల పాఠశాల ఉన్నతాధికారులను అద్దె చెల్లించాలని కోరినా పట్టించుకోలేదన్నారు. ఈ పాఠశాలలో 5వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు సుమారు 539మంది విద్యార్థులు చదువుతున్నారు.



హుజూర్‌నగర్‌లో మైనార్టీ గురుకుల పాఠశాలకు తాళాలు వేయడంతో ఆరుబయటే వేచి ఉన్న ఉపాధ్యాయులు

అక్టోబరు 2వ తేదీ నుంచి 14వ తేదీ వరకు దసరా సెలవులు ముగియడంతో మంగళవారం పాఠశాల పునఃప్రారంభించారు. ప్రభుత్వం బకాయిలు చెల్లించే వరకు తాళాలు తీయబోమని యజమానులు కుమారుస్వామి, మధుబాబు, రమేష్ తెలిపారు.

మైనార్టీ గురుకుల పాఠశాలకు తాళం

తుంగతుర్తి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఏడాదిగా అద్దె బకాయిలు చెల్లించనందుకు సూర్యాపేట జిల్లా తుంగుర్తి మండల కేంద్రంలోని తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాల నిర్వహిస్తున్న ఇంటి యజమాని మంగళవారం ఉదయం తాళం వేశారు. దసరా సెలవులు ముగించుకుని మంగళవారం ఉదయం పాఠశాలకు చేరుకున్న సిబ్బంది, విద్యార్థులు అవక్కయ్యారు. గత సంత్సరం నుంచీ అద్దె ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని పాఠశాల భవన యజమాని బత్తుల లాలయ్య ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రైవేట్ భవనాల యజమానుల ఆదేశం మేరకు నోటీసులిచ్చి తాళం వేశామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎట్టకేలకు జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు భవన యజమాని మధ్యాహ్నం తాళం తీయడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఊపిరి పీల్చుకున్నారు.



సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలకేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాలకు తాళం వేసిన యజమాని

గుప్త నిధుల కోసం తవ్వకాలు

- రాళ్ల మధ్య ఉన్న విగ్రహాలు ధ్వంసం



ధ్వంసమైన బండ రాళ్లు

కొండమల్లేపల్లి, అక్టోబరు 15: (ఆంధ్రజ్యోతి) నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలంలోని చింతచెట్టుతండా గ్రామ పంచాయతీ జేత్యతండాలో గుప్త నిధుల కోసం భారీగా తవ్వకాలు జరిగినట్లు మంగళవారం వెలుగులోకి వచ్చింది. తండావాసులు తెలిపిన వివరాల ప్రకారం.. జేత్యతండా పరిధిలో గల సర్వే నెం.19లో సుమారు 110ఎకరాల పట్టా భూములు ఉన్నాయి. అందులో సుమారు నాలుగు సంవత్సరాల క్రితం ఆంధ్ర ప్రాంతానికి చెందిన ఓ రియలేస్టేట్ వ్యాపారి సుమారుగా 16ఎకరాలు తండాకు చెందిన ముగ్గురు, నలుగురు నుంచి కొనుగోలు చేశాడు. ఆ స్థలంలో గల వీరన్న గుట్టలో వెలిసిన వీరన్న, మల్లన్న, ఆంజనేయస్వామి విగ్రహాలు ఉన్నాయి. చుట్టుపక్కల గల చింతచెట్టుతండా, జేత్యతండా, పూల్‌సింగ్ తండాకు చెందిన గిరిజనులు సుమారు 40 ఏళ్లుగా తమ ఆచారాలకు అనుగుణంగా పండగలకు తమ ఇళ్లల్లో జరిగే శుభకార్యాలకు అక్కడికి వచ్చి పూజలు చేస్తుంటారు. ఆ భూమిని కొనుగోలు చేసిన రియల్ వ్యాపారి గుట్ట చుట్టు ప్రీ కాస్ట్‌తో ప్రహరీ గోడతో పాటు ఓ గేటు ఏర్పాటు చేసి తండావాసులు లోనికి వెళ్లకుండా ఏర్పాట్లు చేశారు. దాదాపు 3నుంచి 4నెలల నుంచి ఎక్సకవేటర్ల సాయంతో రాత్రి వేళలో ఎవరికీ అనుమానం రాకుండా గుట్టను దాదాపుగా 30 అడుగుల వెడల్పు, 50అడుగుల లోతు మేర తవ్వకాలు జరిపారు. గుప్త నిధుల కోసం తవ్విన గుంతను అనుమానం రాకుండా పెద్ద ఎత్తున సొరంగం తవ్వినట్లు తండావాసులు ఆరోపిస్తున్నారు. రెండు రోజుల క్రితం దసరా పండుగను పురస్కరించుకొని ఆయా తండావాసులు పూజల కోసం అక్కడికి వెళ్లగా గేటుకు తాళం ఉండడంతో గోడపైకి ఎక్కి చూశారు. దేవుడి విగ్రహాలు పగిలి ఉండడంతో లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా రానివ్వలేదని తెలిపారు. మూకుమ్మడిగా కలిసి లోపలికి వెళ్లి చూడగా పెద్ద గుంతలు, బొయ్యారం కనిపించడంతో గుంతలు ఎందుకు తవ్వారని రియల్ వ్యాపారిని ప్రశ్నించారు. పొంతన లేని సమాధానం చెప్పడంతో మంగళవారం సదరు రియల్ వ్యాపారిని నిలదీశారు. గుడి కట్టిస్తానని, దాటవేత సమాధానాలు చెబుతున్నట్లు తండావాసులు చెబుతున్నారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. తండావాసుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జి ఎస్ఐ అజ్మీరా రమేష్ తెలిపారు.

కాంగ్రెస్ నేతపై కేసు నమోదు

మిర్యాలగూడ అర్బన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని రాజీవ్‌చౌక్ వద్ద నడిరోడ్డుపై జన్మదినవేడుకలు జరుపుకొని ఆటంకం కలిగించి, ప్రధాన రహదారులపై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడేలా వ్యవహరించిన కాంగ్రెస్ పార్టీ నేతపై మంగళవారం టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. టూటౌన్ సీఐ నాగార్జున తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన డీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుకూరి బాలు పుట్టిన రోజు సందర్భంగా తన అనుచరులు ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించి సోమవారం రాత్రి వేడుకలు నిర్వహించారని సీఐ తెలిపారు. ఎలాంటి అనుమతులు తీసుకోకుండా డీజే మోత, బాణాసంచా కాల్చి స్థానికులకు అసౌకర్యం కల్పించారని, ప్రధాన కూడలిలో నిబంధనలకు విరుద్ధంగా జన్మదిన వేడుకలు నిర్వహించడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందిపడ్డారని సీఐ తెలిపారు. అనుమతి పొందని సితారా డీజే వాహనాన్ని సీజ్‌చేసి, యాజయానితో పాటు నడిరోడ్డుపై పుట్టినరోజు వేడుకలు నిర్వహించి ప్రజాశాంతికి ఆటంకం కలిగించిన నాయకుడితోపాటు కార్యక్రమ నిర్వహకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

శాస్త్రోక్తంగా నిత్యపూజలు

భువనగిరి అర్బన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి నాగవల్లీ దళార్చనలు, లక్ష్మీనృసింహుడికి నిత్యకల్యాణం, నిత్యార్చనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. మంగళవారం కొండపైన విష్ణు పుష్కరిణి వద్ద ఆంజనేయస్వామికి ఆలయంలో అర్చకులు వేద మంత్రపఠనాలతో అభిషేకించిన అర్చకులు 1001 తమలపాకులు, సింధూరం, వివిధ రకాల పూలతో అలంకరించి ఆంజనేయుడికి సహస్రనామ పఠనాలతో నాగవల్లీ దళార్చనలు నిర్వహించి హారతి ఇచ్చారు. పాతగుట్ట ఆలయంలో ఆంజనేయస్వామిని పంచామృతాలతో అభిషేకించి ఆకుపూజ నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 21,99,248 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు.



లక్ష్మీనృసింహుడికి నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఫోర్బ్స్ డిజిటల్ స్టార్.. కొమ్మిరెల్లి ఆకాంక్ష

- మహిళల విభాగంలో 86వ స్థానం పొందిన నార్కట్‌పల్లి యువతి
- బ్యూటీ, ఫ్యాషన్, రీల్స్, ఇన్‌స్టాగ్రామ్ ఫాలోవర్స్ ఆధారంగా గుర్తింపు

నార్కట్‌పల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాత ఆంగ్ల మేగజైన్ ఫోర్బ్స్ డిజిటల్ స్టార్స్ జాబితాలో నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లికి చెందిన యువతి కొమ్మిరెల్లి ఆకాంక్షకు చోటు దక్కింది. ఫోర్బ్స్ మేగజైన్ ప్రతీ ఏటా ప్రకటించే డిజిటల్ స్టార్స్ మహిళా కేటగిరీ విభాగంలో 2023- 2024 సంవత్సరానికి ఆకాంక్షకు ఈ గుర్తింపు లభించింది. దేశవ్యాప్తంగా గుర్తించిన మొదటి 100లోపు మహిళల విభాగంలో ఆమె 86వ ర్యాంకు పొందింది. బ్యూటీ, ఫ్యాషన్, లైఫ్ స్టైల్ కంటెంట్స్ పై అభిరుచితో ఆమె చేసిన రీల్స్, వీడియోలు ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేయగా ఫాలోవర్స్ నుంచి వచ్చిన స్పందన ఆధారంగా ఫోర్బ్స్ మేగజైన్ డిజిటల్ స్టార్స్ జాబితాలో ఆమెకు ఈ గుర్తింపు దక్కింది. వాస్తవికత 77.58 శాతం, గోట్ ఏజెన్సీ స్కోర్ 7.1 శాతం పొంది డిజిటల్ స్టార్స్ జాబితాలో చోటు దక్కించుకుంది. నార్కట్‌పల్లికి చెందిన కొమ్మిరెల్లి అనంతరెడ్డి, మమత దంపతుల రెండో కుమార్తె ఆకాంక్ష పూణేలోని సింబయాసిస్‌లో బీటెక్ చదివింది. ఇంజనీరింగ్ అనంతరం 2019 నుంచి మేకప్ వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం ప్రారంభించింది. సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగాలు వచ్చినా వదులుకుని ఈ ఫ్యాషన్ రంగంపై ఆసక్తి కనబర్చింది. బ్యూటీ, ఫ్యాషన్, లైఫ్ స్టైల్స్ కంటెంట్‌పై వీడియోలు, రీల్స్ చేస్తూ ప్రముఖ ఫ్యాషన్ కంపెనీలను ఆకర్షించింది. దీపికపదుకొనే వంటి ప్రముఖ నటీమణులతో కలిసి ప్రచార ప్రకటనల్లోనూ నటించి ప్రశంసలు అందుకుంది. ఆకాంక్షకు ఇన్‌స్టాగ్రామ్‌లో 3లక్షల మందికిపైగా ఫాలోవర్లు ఉన్నారు. తండ్రి అనంతరెడ్డి రియల్ ఎస్టేట్, వాహనాల రంగంలో పనిచేస్తున్నారు. కెరీర్ ప్రారంభంలో ఏం చేస్తున్నానో తల్లిదండ్రులకు తెలియదని, తన ఎదుగుదల చూసిన తర్వాత వారు కూడా నమ్మి ప్రోత్సహించడం ప్రారంభించారని ఆకాంక్ష ఈ సందర్భంగా పేర్కొంది. ఫోర్బ్స్ జాబితాలో 30వ ర్యాంకు సాధించేలా సన్నద్ధమవుతున్నట్లు తెలిపింది.



ఆకాంక్ష

స్కూల్ బస్ ఎక్కించేందుకు రోడ్డు దాటుతుండగా

గరిడేపల్లి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతిచెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలంలోని రాయినిగూడెంలో మంగళవారం జరిగింది. ఎస్ఐ చలికంటి నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. రాయినిగూడెం గ్రామానికి చెందిన బెక్కం శ్రీరాం(11) తన అమ్మమ్మ వెంకటలక్ష్మీ శ్రీరాంను స్కూల్ బస్ ఎక్కించేందుకు రోడ్డు దాటుతుండగా అదే సమయంలో గరిడేపల్లి వైపు నుంచి హుజూర్‌నగర్ వైపు వెళ్తున్న కారు బాలుడిని ఢీకొంది. శ్రీరాం తలకు, రెండు మోకాళ్లకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని వెంటనే హుజూర్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడ నుంచి ఖమ్మంలోని ఆరోగ్య హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. అప్పటికే బాలుడు మృతిచెందాడని డాక్టర్లు నిర్ధారించారు. బాలుడి తండ్రి బెక్కం అశోక్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



శ్రీరాం (ఫైల్)

కారు అదుపుతప్పి బోల్తా పడి..

యాదగిరిగుట్ట రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కారు అదుపుతప్పి బోల్తా పడి యువకుడు మృతిచెందాడు. సీఐ రమేష్ మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం దౌలత్ గ్రామానికి చెందిన విరమల్లు వినీత్(17) నలుగురు స్నేహితులతో కలిసి ఈనెల 14న రాత్రి తన కారులో వరంగల్- హైదరాబాద్ జాతీయ రహదారిపై హైదరాబాద్‌కు వెళ్తుండగా పెద్దకందుకూర్ స్టేజీ వద్ద కారు అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో డ్రైవింగ్ చేస్తున్న వినీత్ అక్కడికక్కడే మృతి చెందాడు. నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. వినీత్ తండ్రి భిక్షపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

యువకుడి అదృశ్యం

పెన్‌పహాడ్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తన కొడుకు అదృశ్యమయ్యాడని తండ్రి మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలంలోని సింగారెడ్డిపాలెం గ్రామానికి చెందిన పచ్చిపాల లింగరాజు(25) ఈ నెల 13వ తేదీన మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో తన అత్తగారి గ్రామమైన చివ్వెంల మండలం తిమ్మాపురం గ్రామానికి వెళ్తున్నానని కుటుంబ సభ్యులకు చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. అత్తగారింటికి వెళ్లకుండా.. స్వగ్రామానికి రాకపోవడంతో కుటుంబసభ్యులు బంధుమిత్రులకు ఫోన్ చేసినా ఆచూకీ తెలియలేదు. అతని వద్ద ఫోన్ కూడా లేదు. దీంతో తన చిన్నకొడుకు లింగరాజు అదృశ్యమయ్యాడని తండ్రి మల్లయ్య మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవీందర్ తెలిపారు.

ప్రైవేట్ వ్యాపారులకు పత్తి పంట

- బోరానికి రెండు కిలోల తరుగు, రెండు శాతం కమీషన్
- క్వింటాకు రూ.5300- రూ.6300లు చెల్లిస్తున్న వ్యాపారులు
- సమయానికి ఏర్పాటు కాని కొనుగోలు కేంద్రాలు

మోత్కూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) ఆరుగాలం కష్టపడి పండించిన పంట విక్రయించడానికి రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. పత్తి, ధాన్యం తదితర పంటలకు కేంద్ర ప్రభుత్వం గత జూన్‌లో మద్దతు ధర ప్రకటించింది. పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యంతో చేసేదేమీలేక రైతులు పత్తి మిల్లుల యజమానులు, దళారులు అడిగిన(తక్కువ) ధరకు అమ్ముకుని నష్టపోతున్నారు. పెట్టుబడుల కోసం తెచ్చిన అప్పులకు వడ్డీ పెరుగుతుండటం, పత్తి నిల్వ చేయడానికి స్థలం లేకపోవడం, పత్తి ఏరిన కూలీలకు వెంటనే కూలి డబ్బులు ఇవ్వాల్సి ఉండడంతో రైతులు ఏరిన పత్తి ఏరినట్టుగానే తక్కువ ధర అయినా సరే అని అమ్ముకుంటున్నారు.

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 7.13లక్షల ఎకరాల్లో పత్తి సాగు

యాదాద్రిభువనగిరి జిల్లాలో ఈ ఏడాదిలో 1,00,461 ఎకరాల్లో, నల్లగొండ జిల్లాలో 5,34,966 ఎకరాల్లో, సూర్యాపేట జిల్లాలో 78,079 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. ఉమ్మడి జిల్లాలో 49.94 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా. అదను ప్రకారం వర్షాలు కురియక పత్తి చేలు దెబ్బతిన్నాయి.



గతంలో ఎకరాకు పదిపన్నెండు క్వింటాళ్ల పత్తి దిగుబడి వచ్చేది. ఈ సారి ఐదారు క్వింటాళ్లు కూడా వచ్చేలా లేదంటున్నారు. 8 శాతం తేమ ఉన్న నాణ్యమైన పత్తికి ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్‌కు రూ.7,521. ఆపైన తేమ పెరిగితే ఒక్కో శాతానికి రూ.75.21పైసల చొప్పున ధర తగ్గిస్తారు. గరిష్టంగా 12శాతం తేమ శాతం ఉంటే రూ.7,220.16పైసలు చెల్లిస్తారు. తేమ శాతం 12కు మించి ఉంటే కొనరు.

కొనుగోలు కేంద్రాల ప్రారంభం ఆలస్యం కావడంతో

పత్తి కొనుగోలు కేంద్రాలు అక్టోబరు మొదటి వారంలో ప్రారంభిస్తే రైతులకు ఉపయోగకరంగా ఉండేది. గత రెండు సీజన్లలో కూడా నవంబరు నెలలోనే కేంద్రాలు ప్రారంభమయ్యాయి. ఈ సీజన్‌లో కూడా పత్తి కొనుగోలు కేంద్రాలు నవంబరులోనే ప్రారంభమవుతాయనే అనుమానంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులకు పత్తి విక్రయిస్తున్నారు. రైతులు పత్తిని మిల్లులకు, ప్రైవేట్ వ్యాపారులకు క్వింటా రూ.5,300 నుంచి రూ.6,300 వరకు విక్రయిస్తున్నారు. దీనికి బోరానికి రెండు కిలోలు తరుగు, రెండు శాతం కమీషన్ అదనపు నష్టం. పత్తిలో తేమ ఎక్కువగా ఉంటున్నందున ధర తగ్గిస్తున్నామని వ్యాపారులు చెబుతున్నారు. పత్తిలో 25 శాతం తేమ ఉన్నా రూ.6242.43పైసలు ధర ఇవ్వాలి. కాని వ్యాపారులు 8 శాతం తేమ ఉన్న పత్తికి క్వింటా రూ.6300 ఇస్తూ, 25 తేమ ఉన్నా పత్తికి రూ.5200, రూ.5,300లే ఇస్తున్నారు.

నేడు ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనున్న మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి

నల్లగొండ రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎస్ఎల్‌బీసీ వద్ద ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాలను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రోడ్డు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బుధవారం ప్రారంభించనున్నట్లు నల్లగొండ జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు ఎస్ఎల్‌బీసీ వద్ద ఉన్న బత్తాయి మార్కెట్‌లో మార్కెట్‌లో ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తారని ఆయన తెలిపారు.

పత్తి కొనుగోలు కేంద్రాలు వెంటనే ఏర్పాటు చేయాలి



ప్రభుత్వం సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయక పోవడంతో దళారులు, పత్తి మిల్లుల యజమానులు తక్కువ ధరకు కొంటున్నారు. ఈ ఏడాది అదను ప్రకారం వర్షాలు కురియక పత్తి దిగుబడి తగ్గింది. ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకు అమ్ముకుంటే పెట్టుబడులు కూడా చేతికి రాక అప్పులు మీద పడతాయి. నేను ఇప్పటికి 40 క్వింటాళ్ల పత్తిని తేమ ఎక్కువ లేకున్నా క్వింటా రూ.5,800 చొప్పునే అమ్ముకున్నా.

● మర్రి కొమురయ్య, పత్తి రైతు, మోత్కూరు

41 సీసీఐ కేంద్రాల ఏర్పాటుకు కసరత్తు

యాదాద్రిభువనగిరి జిల్లాలో 12, నల్లగొండ జిల్లాలో 23, సూర్యాపేట జిల్లాలో 6 జిన్నింగ్(పత్తి) మిల్లుల్లో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. సీసీఐ పత్తి కొనుగోలుకు సంబంధించి సాఫ్ట్‌వేర్ లోడ్ చేయాల్సి ఉందని, పత్తి నాణ్యతను పరిశీలించి కొనుగోలు చేసే బయ్యర్లను నియమించాల్సి ఉందని చెబుతున్నారు.

తాగునీటి బకాయి వసూళ్లకు స్పెషల్ డ్రైవ్

- వినియోగదారుల బాధ్యతా రాహిత్యం
- వసూళ్లలో సిబ్బంది అలసత్వం
- భువనగిరి మునిసిపాలిటీలో రూ.5కోట్ల నీటి చార్జీల బకాయిలు



బిల్లు చెల్లించనివారి నల్లా కనెక్షన్లు తొలగిస్తున్న మునిసిపల్ సిబ్బంది

భువనగిరి టౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): వినియోగించుకున్న తాగునీటికి చార్జీలను చెల్లించడంతో వినియోగదారుల బాధ్యతా రాహిత్యం, చార్జీల వసూళ్లలో మునిసిపల్ సిబ్బంది ఏళ్ల తరబడిగా చూపిన అలసత్వంతో భువనగిరి మునిసిపాలిటీలో సుమారు రూ.5కోట్ల నీటి చార్జీల బకాయిలు పేరుకుపోయాయి. వాస్తవానికి నో ప్రాఫిట్, నో లాస్ విధానంలో నీటి సరఫరా విభాగం పని చేయాల్సి ఉంటుంది. కానీ వినియోగదారులు, సిబ్బంది వైఖరితో భువనగిరి మునిసిపల్ నీటి సరఫరా విభాగం అస్తవ్యస్తంగా మారుతోంది. అంతే కాక హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ (హెచ్ఎండబ్ల్యూఎస్)కు భువనగిరి మునిసిపాలిటీ నెలవారీగా చెల్లించాల్సిన చార్జీలు రూ.3 కోట్ల బకాయిలుగా పేరుకుపోయాయి. ఈ నేపథ్యంలో నీటి చార్జీల వసూళ్లకు అధికారులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. 'బకాయి చార్జీలను చెల్లించండి.. లేదా నల్లా కనెక్షన్ తొలగిస్తాం' అం టూ మునిసిపల్ సిబ్బంది బకాయి దారులను సూచిస్తున్నారు. దీంతో పలువురు పెండింగ్ చార్జీలను చెల్లిస్తుండగా ముఖం చాటేస్తున్న మరికొద్ది మంది వినియోగదారుల నల్లా కనెక్షన్లను సిబ్బంది తొలగిస్తున్నారు.

రూ.5కోట్ల నీటి చార్జీల బకాయిలు

భువనగిరి మునిసిపల్ పరిధిలో అసెస్మెంట్ జరిగిన భవనాలు, సుమారు 15,100 ఉన్నాయి. వీటికి సుమారు 9200 నల్లా కనెక్షన్లు ఉన్నాయి. గృహ వినియోగ నల్లాలకు నెలసరిగా రూ.100, వాణిజ్య నల్లాలకు రూ.250, స్పెషల్ కేటగిరి నల్లాకు రూ.500 నుంచి రూ.1000 వరకు చార్జీలను చెల్లించాల్సి ఉంటుంది. రోజువారీగా హెచ్ఎండబ్ల్యూఎస్ సరఫరా చేసే 5.5 ఎంఎల్‌డీ గోదావరి జలాలు, స్థానిక వనరుల ద్వారా మరో 5 ఎంఎల్‌డీ అనగా ప్రతీ రోజు నల్లాల ద్వారా సుమారు 10.5 ఎంఎల్‌డీ తాగునీటిని మునిసిపాలిటీ సరఫరా చేస్తోంది. హెచ్ఎండబ్ల్యూఎస్ సరఫరా చేసే గోదావరి జలాలకు భువనగిరి మునిసిపాలిటీ నెలవారీగా సుమారు రూ.16లక్షలు చార్జీల రూపకంలో చెల్లిస్తోంది. సుమారుగా అంతే మొత్తంలో నెలవారీగా నీటి చార్జీల డిమాండ్ ఉంటోంది. అంతేకాక పవర్ బోర్లు ఇతర వనరుల ద్వారా సరఫరా చేసే స్థానిక జలాలకు విద్యుత్ బిల్లులను చెల్లించాల్సి ఉంటోంది. కానీ ఏళ్ల తరబడిగా నీటి చార్జీలను చెల్లించడంలో వినియోగదారులు, వసూలు చేయడంలో సిబ్బంది చూపిన నిర్లక్ష్యం ఫలితంగా ఏరియర్స్ చార్జీలుగా సుమారు రూ.3.50కోట్లు, విద్యుత్ డిమాండ్ చార్జీలు సుమారు రూ.1.60 కోట్లు వసూలు కావాల్సి ఉంది. బిల్లులు సకాలంలో వసూలు కాకపోతుండడంతో హెచ్ఎండబ్ల్యూఎస్‌కు సుమారు రూ.3కోట్లు, ట్రాన్స్‌కోకు విద్యుత్ బిల్లులు సుమారు రూ.1.20కోట్లు భువనగిరి మునిసిపాలిటీ బకాయిలుగా చెల్లించాల్సి ఉంది. ఆస్తిపన్ను చెల్లింపు, వసూళ్లలో చూపే శ్రద్ధ నీటి చార్జీలలోనూ చూపి ఉంటే ఇంత భారీగా బకాయిలు పేరుకపోయి ఉండేవి కావని పలువురు అంటున్నారు. అయితే పలు గృహాలు శిథిలమై ఎవరూ నివాసం ఉండనప్పటికీ ఆ ఇళ్లలో నల్లా కనెక్షన్లు ఉన్నట్లు రికార్డులు పేర్కొంటున్నాయి. దీంతో నీటి చార్జీల బకాయిలు భారీగా పేరుకుపోయినట్లు రికార్డుల్లో నమోదు అవుతున్నట్లు సిబ్బంది పేర్కొంటున్నారు. శిథిల గృహాల నల్లాలను తొలగిస్తే బకాయిలు తగ్గుతాయని అంటున్నారు.

ఫలితాలిస్తున్న ప్రత్యేక కార్యక్రమం

బకాయి నీటి చార్జీల వసూళ్ల కోసం చేపట్టిన స్పెషల్ డ్రైవ్ సత్ఫలితాలను ఇస్తున్నట్లు తెలుస్తున్నది. స్పెషల్ డ్రైవ్ చేపట్టినప్పటి నుంచి సుమారు రూ.50లక్షల పైబడి వసూళ్లు అయ్యాయి. అలాగే చార్జీలు చెల్లించని పలు నల్లా కనెక్షన్లను సిబ్బంది తొలగిస్తున్నారు. స్పెషల్ డ్రైవ్ కోసం అధికారులు ప్రత్యేక బృందాలను నియమించారు. ఆయా బృందాలు నిర్ధేశిత గృహాలకు వెళ్తూ పెండింగ్ చార్జీల చెల్లింపుపై వినియోగదారులకు అవగాహన కల్పిస్తూ వసూళ్లు చేస్తున్నారు. ముఖం చాటేస్తున్న వినియోగదారుల నల్లా కనెక్షన్లను తొలగిస్తున్నారు. అదే సమయంలో శిథిల భవనాల నల్లా కనెక్షన్లను కూడా గుర్తిస్తున్నారు.

పట్టణాభివృద్ధికి సహకరించాలి



వినియోగదారులు నీటి చార్జీలు సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలి. ఆన్‌లైన్‌లో లేదా ఆఫ్‌లైన్‌లో చార్జీలను చెల్లించే అవకాశం వినియోగదారులకు కల్పించాం. బకాయి నీటి చార్జీలు చెల్లించకపోతే మునిసిపల్ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటాం. శిథిల భవనాల నల్లా కనెక్షన్ల తొలగింపుపై ఉన్నతాధికారులు, మునిసిపల్ కౌన్సిల్ నిర్ణయం మేరకు చర్యలు తీసుకుంటాం.

-పి.రామాంజలరెడ్డి, కమిషనర్, భువనగిరి మునిసిపాలిటీ

అవకతవకలపై నజర్

- ఇంటి నెంబర్ల కేటాయింపుపై ఫిర్యాదుల వెల్లువ
- న్యాయం చేయాలని కోర్టును ఆశ్రయిస్తున్న ప్రజలు

మొదటిపేజీ తరువాయి.. ఇళ్ల నిర్మాణాల అనుమతులపై క్షేత్రస్థాయికి వెళ్లి, పూర్తిస్థాయి నివేదికలు సిద్ధం చేసుకోవాలని కూడా ఆదేశాలు జారీచేశారు.

దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి..

గ్రామపంచాయతీల్లో నెలకొన్న సమస్యలపై వస్తున్న ఫిర్యాదులపై అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి విచారణ చేపట్టేందుకు జిల్లాయంత్రాంగం చర్యలు తీసుకుంటుంది. ఈ మేరకు జిల్లాయంత్రాంగం డీఎల్‌పీవోలు, ఎంపీవోలకు ఆదేశాలు జారీచేసింది. ప్రజావాణితోపాటు మండలాలు, గ్రామపంచాయతీల్లో అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, వాటికి పరిష్కార మార్గాలను కూడా చూపనున్నారు. ఇటీవల ప్రజావాణిలో చౌటుప్పల్ మండలం ఎస్.లింగోటం గ్రామానికి చెందిన మహిళ తనకు ఇంటినెంబరు ఇవ్వడంలేదని, నల్లా కనెక్షన్ కూడా పట్టించుకోవడంలేదని ఆత్మహత్యాయత్నం చేశారు. ఈ సమస్యపై ఎంపీవో విచారణ చేపట్టగా వారసత్వ గొడవతోనే ఇంటి నెంబరు కేటాయించలేదని తేల్చారు. కుటుంబసభ్యులందరి పేరుతో ఇంటి నెంబర్‌ను కేటాయిస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఇలాంటి కేసులు చాలా వరకు వస్తున్నాయి. ప్రతీ దరఖాస్తునూ క్షేత్రస్థాయిలో పరిశీలించి వెనువెంటనే నిర్ణయం తీసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు.

నల్లా కనెక్షన్లపై ప్రత్యేక యాప్

ప్రభుత్వం మిషన్‌భగీరథ నల్లా కనెక్షన్లపై సర్వేను నిర్వహించింది. ఇందుకోసం ప్రభుత్వం ఒక ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. ఈ యాప్‌లోనే నల్లా కనెక్షన్ల వివరా లు నమోదు చేశారు. జిల్లాలో మొ త్తం 425 గ్రామపంచాయతీలు, ఆరు మునిసిపాలిటీలు ఉన్నాయి. 769 ఆవాసాలకు 66.63ఎంఎల్ వాట ర్‌ను నిత్యం సరఫరా చేస్తున్నారు. ప్రభుత్వం ఒక్కో గ్రామం యూనిట్‌గా తీసుకుని ఎన్ని ఆవా సాలున్నాయి? ఎన్ని నల్లా కనెక్షన్లు ఇచ్చారు? నల్లా కనెక్షన్లు కొత్తవి ఎన్ని, పాత కనెక్షన్లు పునరు ద్ధరించినవి ఎన్ని? మిషన్‌భగీరథ పైపు లైన్ ద్వారా ప్రజలకు నీరు అందుతుందా? వాట ర్ ట్యాంకులు పరిస్థితి, పైపులైన్ల లీకేజీవంటి అన్ని అంశాలపై క్షుణ్ణంగా సర్వే చేపట్టారు. ప్రతీ ఇం టికి వెళ్లి నల్లా కనెక్షన్ల పూర్తి వివరాలు కూ డా యాప్‌లో నమోదు చేశారు. ప్రస్తుతం జిల్లాలో మొత్తం 1,42,903 ఇళ్లకు కొత్త నల్లా కనెక్షన్లు ఏ ర్పాటు చేశారు. 41,436 ఇళ్లకు పాత కనెక్షన్లు సరిచేశారు. అయితే అధికారులు నిర్వహించిన సర్వేల్లో ఉన్న ఇళ్లను తిరిగి నిర్మించుకోవడంతో పాటు పలు లేఅవుట్లతో కొత్తగా కొన్ని నిర్మాణాలు చేపట్టినట్లు తేల్చారు. అయితే చాలాచోట్ల శిథిలావస్థలో ఉన్న ఇళ్లకు కూడా కనెక్షన్ పైపులైన్‌ను ఏర్పాటుచేసినట్లు తేలింది. ఈ సర్వే ఆధారంగా కొత్తగా ఎన్ని ఇళ్ల నిర్మాణాలను చేపట్టారన్నది కూడా తేలనుంది.

ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాం



గ్రామపంచాయతీల్లో నెలకొన్న పలు సమస్యలపై వస్తున్న ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాం. ప్రజావాణితోపాటు అధికారుల ద్వారా నేరుగా వస్తున్న వాటిని వెంటనే పరిష్కరించాలని కోరుతూ క్షేత్రస్థాయి అధికారులకు ఆదేశాలు జారీచేస్తున్నాం. జిల్లాలోని పలు మండలాల్లో ఇళ్ల నిర్మాణాల అనుమతులపై ఫిర్యాదులు అందుతున్నాయి.

- ఆర్. సునంద, డీపీవో

నేడు నీటి సరఫరాకు అంతరాయం

భువనగిరి రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తుర్కపల్లి మండల పరిధిలో జీఎల్‌బీఆర్ ట్యాంకు నుంచి భువనగిరి మండలానికి వచ్చే పైపులైన్ మరమ్మతుల కారణంగా ఈ నెల 16నుంచి 17వరకు ఒక రోజు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడు తుందని మిషన్ భగీరథ భువనగిరి డివిజన్ ఈఈ కరుణాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిధిలోని భువనగిరి, ఆత్మకూర్ (ఎం), బీబీనగర్, మోటకొండూరు, వలిగొండ, రామ న్నపేట, పోచంపల్లి మండలాల్లో గోదావరి నుం చి వచ్చే మంచినీటి సరఫరాను ఒక రోజు నిలిపివేస్తున్నట్లు ప్రజలు సహకరించాలని కోరారు.

నియామకాల్లో బీఈడీ అభ్యర్థులకు అన్యాయం

బొమ్మలరామారం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ 2024 ఉద్యోగ నియామకాల్లో బీఈడీ అభ్యర్థులకు అన్యాయం జరిగిందని, రాబోయే డీఎస్సీలో అలా కాకుండా చూడాలని తహసీల్దార్ శ్రీనివాస్‌రావుకు బీఈడీ అభ్యర్థుల సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. సంఘం నాయకులు ఎలబోయిన శ్రీహరి, మైలారం జంగయ్య, సానాల శ్రీశైలం మాట్లాడుతూ ప్రధానంగా రెండు శాతం జనాభా లేని వాళ్లకు 10శాతం ఈ డబ్ల్యూఎస్ రిజర్వేషన్ ఇవ్వడం వల్ల ఎక్కువ నష్టం వాటిల్లిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్ తర్వాత జనరల్ కోటాలో ఈ డబ్ల్యూఎస్ వారికి అవకాశం ఇవ్వాల్సి ఉండగా మొత్తం పోస్టుల్లో పదిశాతం ఇవ్వడం సమంజసం కాదన్నారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని కోరారు.

ఏటీసీఎస్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

భువనగిరి కలెక్టరేట్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆలేరు ప్రభుత్వ ఐటీఐలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీఎస్)లో ఇప్పటి వరకు సీట్లను కేటాయించని అభ్యర్థుల కొరకు 6వ విడత వాక్‌ఇన్ అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని కన్వీనర్, ప్రిన్సిపాల్ బి.హరికృష్ణ మంగళవారం తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా అక్టోబరు 19లోపు హెచ్‌టీటీపీ.. ఐటీఐ తెలంగాణ . జీవోవీ. ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకుని అప్లికేషన్ ప్రింటెడ్ కాపీతో పాటు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో వాక్‌ఇన్ అడ్మిషన్‌కు స్వయంగా హాజరు కావాలన్నారు. మరిన్న వివరాలకు కళాశాల కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ప్రతీ చెరువునూ గోదావరి జలాలతో నింపుతాం

ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

తుర్కపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కొండపోచమ్మ, మల్లన్న సాగర్ రిజర్వాయర్ల ద్వారా గోదావరి జలాలతో నియోజకవర్గంలోని ప్రతీ చెరువునూ నింపి సాగు, తాగునీరందిస్తామని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. తుర్కపల్లి మండలం మల్కాపూర్ సమీపంలో కొండపోచమ్మ రిజర్వాయర్ నుంచి ఏర్పాటు చేసిన కాల్వను ఆయన పరిశీలించి మాట్లాడారు. కొన్ని రోజులుగా నియోజకవర్గం నలు మూలల నుంచి గోదావరి జలాలు ప్రవహిస్తుండడంతో కొన్ని చెరువులు నిండి అలుగు పోస్తున్నాయని కొండపోచమ్మ ప్రాజెక్టు నుంచి మండలంలోని వాసాలమర్రి, మల్కాపూర్, సంగ్యాతండా మీదుగా వెంకటాపూర్ గ్రామ శివారులో ఉన్న తీక చెరువును నింపి తద్వారా మల్లాపూర్, సైదాపూర్, మాసాయిపేట గ్రామాల్లోని చెరువులను నింపుతామన్నారు. అంతేకాకుండా నియోజకవర్గంలోని గొలుసు కట్టు చెరువులన్నింటినీ గోదావరి జలాలతో నింపేందుకు కృషి చేస్తున్నామన్నారు.



ప్రభుత్వ విప్‌ను గజమాలతో సన్మానిస్తున్న గిరిజనులు

తుల్జా భవాని వేడుకలు

తుర్కపల్లి మండలం బీల్యానాయక్ తండాలో మంగళవారం తుల్జాభవాని (ముత్యాలమ్మ) వేడుకలను గిరిజనులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య పాల్గొనగా ఆయనను గిరిజన నాయకులు గజమాలతో ఘనం గా సన్మానించారు. కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ చైర్మన్ ఐనాల చైతన్య మహేందర్‌రెడ్డి, తహసీల్దార్ దేశానాయక్, మాజీ ఏఎంసీ చైర్మన్ ధానావత్ శంకర్‌నాయక్, నాయకులు చాడ భాస్కర్‌రెడ్డి, ధనావత్ మోహన్‌బాబు, భూక్య రాజారామ్, దేవరుప్పల అయిలయ్య, సొన్నాయిల రఘు, ఎరుకల వెంకటేష్‌గౌడ్, బొల్లారం జగదీష్, సొమల్ల వెంకటేష్ పాల్గొన్నారు.

మంత్రి పొన్నంను కలిసిన ప్రభుత్వ విప్

ఆలేరు రూరల్: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మునుగోడు శాసన సభ్యులు రాజగోపాల్‌రెడ్డిని మంగళవారం ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కాండ్రాజు వెంకటేశ్వర్‌రాజు, భానుప్రకాశ్, తుంగ కుమార్, సురేష్‌గౌడ్, రాజు, మారుతి ఉన్నారు.

బీఆర్ఎస్ నాయకుల జోలికి వస్తే సహించం

డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై పోలీసులు అక్రమంగా కేసులు నమోదుచేసి వేధింపులకు గురిచేస్తే తగిన మూల్యం చెల్లించక తప్పదని డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం స్థానిక సీఐ రమేష్ తీరును నిరసిస్తూ ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఏసీపీ రమేష్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మల్లాపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త కర్రె చంద్రశేఖర్ ఈ నెల 14న సోషల్ మీడియాలో మల్లాపురం గ్రామ వాట్సాప్ గ్రూప్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యపై చర్చించినట్లు కురుమ సంఘం గ్రూపుల్లో పోస్ట్ పెట్టారని అదే గ్రామానికి చెందిన ఎమ్మెల్యే బావమరిది ఎర్ర అయిలయ్య పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని తెలిపారు. అదే రోజు మధ్యరాత్రి 10 మంది పోలీసులు వాహనంపై చంద్రశేఖర్‌ను అరెస్టు చేయడానికి గ్రామానికి వెళ్లగా ఆయన ఇంట్లో లేకపోవడంతో తండ్రి కర్రె అయిలయ్య ఇంటికి వెళ్లారని తెలిపారు. చంద్ర శేఖర్ ఎక్కడికి వెళ్లాడో జాడ తెలపాలని బెదిరించి, పక్షవాతంతో మంచంపై పడి ఉన్న చంద్రశేఖర్ తండ్రిని బలవంతంగా జీపులోకి తీసుకెళ్లి మూడు ఊళ్లు తిప్పారని, కనీసం పక్షవాతం వచ్చిన వ్యక్తిని వదులకుండ వేధించారని ఆవే దన వ్యక్తంచేశారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవరిస్తూ అధికార పార్టీకి కొమ్ముకాస్తున్నారని ఆరో పించారు. ఇప్పటికైన పోలీసుల తీరు మారకుం టే ఆలేరు నియోజకవర్గం వ్యాప్తంగా 10వేల మంది బీఆర్ఎస్ కార్యకర్తలు, మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్‌రావుతో కలిసి స్థానిక పోలీస్ స్టేషన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య, గుట్ట పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మిడి రాంరెడ్డి, ఆలేరు మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్‌గౌడ్, మిట్ట వెంకటయ్యగౌడ్ పట్టణ బీఆర్ఎస్ పార్టీ సెక్రెటరీ జనరల్ పాపట్ల నరహరి, మునిసిపల్ వైస్ చైర్మన్ కాటంరాజు, కౌన్సిలర్ బూడిద సురేందర్ నాయకులు భీమగాని నర్సింహగౌడ్, మహేందర్, కర్రె అయిలయ్య, సతీష్, శ్రీశైలం, యాకూబ్, పాల్గొన్నారు.



ఏసీపీకి ఫిర్యాదు చేస్తున్న మహేందర్‌రెడ్డి

విచారణ నిమిత్తం వెళ్లాం: సీఐ

కర్రె చంద్రశేఖర్ కురుమ సంఘం వాట్సాప్ గ్రూప్‌లో అసభ్య పదజాలంతో దూషించారని అదే గ్రామానికి చెందిన ఎర్ర అయిలయ్య ఫిర్యాదు చేశారని సీఐ రమేష్ తెలిపారు. ఈ మేరకు పోలీసులు చంద్రశేఖర్‌ను తీసుకరావడానికి వెళ్లగా ఆయన పారిపోయాడని తెలిపారు. చంద్రశేఖర్ తండ్రి అయిలయ్య తన కుమార్తె ఇంటివద్ద ఉంటాడని చూపిస్తానని చెప్పారని పేర్కొన్నారు. తనపై తప్పుడు ఆరోపణ చేస్తున్నారని ఎవరిని ఇబ్బందులకు గురి చేయలేదని సీఐ తెలిపారు. తప్పు చేస్తే ఎవరిపైనైనా చట్టపరమైన చర్యలు తప్పవని అన్నారు.

మార్కెట్ యార్డుకు తరలివస్తున్న ధాన్యం



చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులు పోసిన ధాన్యం రాశులు

చౌటుప్పల్ టౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): చౌటుప్పల్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డుకు ధాన్యం చేరుకుంటోంది. ఈ నెల ఒకటవ తేదీ నుంచి 15 వ తేదీ వరకు 69 మంది రైతులు తమ ధాన్యాన్ని విక్రయించేందుకు గాను మార్కెట్ యార్డులో రాశులుగా పోశారు. రైతులు రాశులుగా పోసిన ధాన్యం సుమారు గా 15 నుంచి 20 వేల బస్తాలుగా ఉంటుందని ఏఎంసీ అధికారుల అంచనా.

ఆందోళన చెందుతున్న రైతులు

గత 16 రోజుల్లో తరచూ కొద్ది పాటిగా వర్షాలు కురుస్తుండడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. సోమవారం కూడా కొద్ది పాటి చినుకులు వచ్చి పోయాయి. పొలాల్లో కోసిన ధాన్యాన్ని రైతులు నేరుగా మార్కెట్ యార్డుకు తీసుకువచ్చి శుభ్రం చేసుకొని ఆరబెట్టుకుంటున్నారు. శుభ్రం చేసిన ధాన్యం అకాల వర్షాలకు తడిసి పోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. రైతుల ధాన్యం రాశులపై కప్పేందుకు అవసరమైన టార్పాలిన్ కవర్లను అందజేసినట్లు ఏఎంసీ సెక్రటరీ రవీందర్ రెడ్డి తెలిపారు.

ఘనంగా దుర్గాదేవి నిమజ్జనోత్సవం



శోభాయాత్రలో నృత్యం చేస్తున్న కళాకారులు

భువనగిరి టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): భువనగిరి మీనానగర్‌లో వీరశివాజీ యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గాభవాని నిమజ్జన శోభాయాత్ర మంగళవారం ఘనంగా నిర్వహించారు. దేవతామూర్తులు వేషధారణలు, భజనలు, కోలాటాల నడుమ ఊరేగింపు సాగింది. విగ్రహాన్ని పెద్ద చెరువులో నిమజ్జనం చేశారు. ముందుగా మానస హాస్పటల్ నిర్వాహకులు డాక్టర్ జి.విజయభార్గవ్, వీర శివాజీయూత్ అధ్యక్షుడు సుదగాని రాజు ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు నిర్వహించారు. నిమజ్జన ఊరేగింపులో పెద్ద సంఖ్యలో భక్తజనం పాల్గొన్నారు.

అబ్దుల్‌కలాంకు ఘన నివాళులు

ఆలేరు రూరల్/ మోత్కూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): దేశ రక్షణ రంగ పటిష్టత కోసం నిరంతరం కృషి చేసిన మిసైల్ మ్యాన్ డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం అని పలువురు కొనియాడారు. ఆలేరులో రాఘవ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలాం పేరు చెబితే గుర్తించని భారతీయుడు ఎవరూ ఉండరన్నారు. కార్యక్రమంలో నాయకులు పులిపలుకుల మహేష్, రాములు శంకరయ్య, రాజు, రాంచందర్, సందీప్, విష్ణు, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

● ముదిరాజ్ సంఘం ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు బుంగపట్ల యాకయ్య మోత్కూరులో అబ్దుల్‌కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఏవోవీఎన్ దరఖాస్తు గడువు పొడిగింపు

భువనగిరి కలెక్టరేట్, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): విదేశాల్లో ఉన్న చదువులకు ఉపకార వేతనంకోసం అంబేడ్కర్ విదేశీ విద్యానిధి పథకం (ఏవోవీఎన్) గడువు అక్టోబరు 29వరకు పొడిగించినట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఎం.జయపాల్‌రెడ్డి మంగళవారం ఒర ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి షెడ్యూల్డ్ కులానికి చెందిన అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి ఈపాస్ వెబ్‌సైట్ హెచ్‌టీటీపీఎస్/తెలంగాణ ఈపాస్.జీవోవీ ఇన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం : సీఐ

మోటకొండూరు, అక్టోబరు, (ఆంధ్రజ్యోతి) 15: సైబర్ నేరాల పట్ల విద్యార్థులు, యువకులు, ప్రజలు ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని సీఐ కొండల్‌రావు, ఎస్ఐ పాండు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో యువతకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలను అపరిచితులతో పంచుకోవద్దని సైచించారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు 1930 టోల్‌ఫ్రీ నెంబర్‌కు డయల్ చేయాలన్నారు. ముఖ్యంగా యూవత డ్రగ్స్ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని అన్నారు. డ్రగ్స్ తీసుకోవడం వల్ల జీవితం నాశనం అవడంతో పాటు భవిష్యత్ లేకుండా చేస్తుందని తెలిపారు.

'మోదీ నాయకత్వంలో దేశాభివృద్ధి'

చౌటుప్పల్ టౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో పయనిస్తోందని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి జి.ఉమారాణి అన్నారు. చౌటుప్పల్ మునిసిపాలిటీలోని 36, 37వ పోలింగ్ బూత్‌లలో మంగళవారం నిర్వహించిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఉమారాణి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రమనగోని శంకర్, పట్టణ అధ్యక్షుడు కంచర్ల గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపకార వేతనాలు విడుదల చేయాలి : ఎస్ఎఫ్ఐ

భువనగిరి గంజ్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : గత ఆరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చింతల శివ, లావుడియా రాజు డిమాండ్ చేశారు. భువనగిరిలో మంగళవారం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో రూ. 8వేల కోట్లకు పైగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అద్దెభవనాల్లో నడుస్తున్న గురుకులాలకు సంబంధించిన అద్దె చెల్లింపులు తక్షణమే చెల్లించాలన్నారు.

పీడీఎస్‌యూ సభను విజయవంతం చేయాలి

భూదాన్‌పోచంపల్లి/ఆలేరు రూరల్, అక్టోబరు 15 : ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) అర్ధ శతాబ్దపు ఉత్సవ సభను విజయవంతం చేయాలని పీవైఎల్ పట్టణ కార్యదర్శి పగడాల శివ కోరారు. పీడీఎస్‌యూ అర్ధ శతాబ్దపు ఉత్సవాల సభకు సంబంధించిన పోస్టర్లను భూదాన్‌పోచంపల్లి పీవైఎల్, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈనెల 24న హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలో భారీ ఎత్తున జరిగే బహిరంగ సభకు ప్రస్తుత, మాజీ విద్యార్థులు, మేధావులు తరలి రావాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు వినయ్, కార్తీక్, కిరణ్, మధు, ప్రసన్న, రాకేష్, పల్లవి, నందిని పాల్గొన్నారు.

● ఆలేరులో పీడీఎస్‌యూ జిల్లా నాయకులు ఆర్ ఉదయ్, ప్రవీణ్ మాట్లాడారు. ఈ నెల 18న ఆలేరులో, 24న హైదరాబాద్‌లో ఉస్మానియా యూనివర్సిటీలో జరిగే సభల్లో అందరూ పాల్గొనాలన్నారు. విద్యార్థి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్నది తమ సంఘమేనన్నారు.

దళితుల భూములను తిరిగి ఇప్పించాలి

భువనగిరి టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గతంలో కబ్జాకు గురైన దళితుల భూములను ప్రభుత్వం తిరిగి బాధితులకు ఇప్పించాలని కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ అన్నారు. ఈ మేరకు దళితుల భూముల కబ్జాల ఉదంతంలో నమోదైన కేసుల వివరాలు ఇవ్వాలంటూ మంగళవారం భువనగిరి డీసీపీ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. శంకర్, గణేష్, భాస్కర్, బిక్షపతి ఉన్నారు.

ఇందిరమ్మ కమిటీ వేయాలి

మోత్కూరు, అక్టోబరు 15: (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీల ఏర్పాటు వెంటనే పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి పి.యాదయ్య ఆదేశించారు. మంగళవారం మోత్కూరు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన పంచాయతీ కార్యదర్శులు, గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీడీవో ఎండి.నిరంజన్, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

తప్పించుకు తిరుగుతున్న నేరస్థుడి అరెస్ట్

అడ్డగూడూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జైలు శిక్ష పడి, బైయిల్‌పై బయటకు వచ్చిన ఓ నిందుతుడిని మూడు సంవత్సరాల నుంచి కోర్టుకు హాజరు కాకుండా తప్పించుకుని తిరుగుతుండడంతో నిందితుడిని అడ్డగూడూరు పోలీసులు మంగళవారం పోలీసులు పట్టుకుని, కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు. ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. అడ్డగూడూరు మండలంలోని వెల్దేవి గ్రామానికి చెందిన గోలి శంకర్ అడ్డగూడూరు పోలీస్ స్టేషన్లో 2020 సంవత్సరంలో వృద్ధురాలిపై లైంగిక దాడికి యత్నించడంతో కేసు నమోదైంది. ఆ కేసులో భువనగిరి కోర్టు విచారణ జరుపగా నిందితుడికి రెండు సంవత్సరాల జైలు శిక్ష విధించింది. తర్వాత అతను హైకోర్టుకు వెళ్లి బెయిల్ తెచ్చుకున్నాడు. బెయిల్ పై బయటకు వచ్చిన శంకర్ మూడేళ్లుగా తప్పించుకు తిరుగుతున్నాడు. హైద్రాబాదులో ఉన్నాడన్న పక్కా సమాచారంతో ఎస్ఐ నాగరాజు ఆదేశాలతో హెడ్ కానిస్టేబుల్ రామనర్సయ్య, కానిస్టేబుల్ రజనికాంత్ శంకర్‌ను అరెస్టు చేశారు. మంగళవారం శంకర్‌ను కోర్టులో హాజరు పరిచి, జైలుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యవసాయానికి పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం



బిక్కేరు వాగులో ఎమ్మెల్యే సామేలు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

అడ్డగూడూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయానికి పెద్దపీట వేస్తోందని సింగిల్ విండో చైర్మన్ కొప్పుల నిరంజన్‌రెడ్డి అన్నారు. మంగళవారం అడ్డగూడూరు మండలంలోని చిన్నపడిశాల బిక్కేరు వాగు చెక్ డ్యాంమ్‌లోకి గోదావరి జలాల రాకను హర్షిస్తూ, బిక్కేరు వాగు చెక్‌డ్యాంమ్ వద్ద కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించి, బిక్కేరు వాగు పరిసర ప్రాంత రైతులతో కలిసి తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ఈ బిక్కేరు వాగుకు సాగు నీరు అందక వందలాది ఎకారాలు బీడు భూములుగా మారితే నాడు పట్టించుకునే నాథుడే లేడని ఆయన విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ మాట్లాడి, బిక్కేరు వాగులోకి గోదావరి జలాలను రప్పించారని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు తీగల గోవర్ధన్‌రెడ్డి, బూత్ కమిటీ అధ్యక్షుడు అంబటి భాస్కర్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు ముస్కు బిక్షంరెడ్డి, ఓర్సు పురుషోత్తం అల్లే యేసురత్నం, బుషిపాక చెన్నేయ్య, అంబటి రామనర్సయ్య, చుక్క రాములు, చుక్క నర్సయ్య, ఓర్సు నవీన్, తునీకేషీ సోంమిరెడ్డి, అంబటి రవి, లొడంగి మల్లయ్య, సోమయ్య ఉన్నారు.

గాలికుంటు వ్యాధికి ఉచిత టీకాలు

భువనగిరి కలెక్టరేట్, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): పశువులలో గాలికుంటూ వ్యాధి నివారణకు పశువైద్య, పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు ఉచితంగా టీకా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ వీ.కృష్ణ తెలిపారు. జిల్లాలోని పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణకు ప్రతి ఏటా రెండు పర్యాయాలు ఉచిత టీకా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 15నుంచి నవంబరు 14వరకు కార్యక్రమం కొనసాగుతుందన్నారు. జిల్లాలోని 17మండలాల్లో మొత్తం 45 బృందాలు ఏర్పాటు చేసి, 1.64లక్షల గోజాతి, బర్రె జాతి పశువులకు టీకాలు వేయటమే లక్ష్యంగా చేసుకున్నామన్నారు. గాలికుంటు టీకా వేసిన పవువుల సమాచారాన్ని ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేస్తున్నామన్నారు.